ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:86 | ఎడిటర్:మేనం శ్యామ్ | గురువారం 15-10-2026 | పేజీలు: 10

దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,40,077/- (22 క్యారెట్స్)
1,52,160/- (24 క్యారెట్స్)

సిరా చుక్క

నీటి చుక్కే..
రేపటి జీవనానికి రక్ష!''
ఎల్‌నినో ప్రభావం..
మండుతున్న ఎండలు..
ఇవి ప్రకృతి ఇస్తున్న
ప్రమాద హెచ్చరికలు!
కరోనా సమయంలో కూడ
ప్రకృతి ముందస్తు సూచనలు ఇచ్చిన..
వినక... కృతిమ గాలికోసం
వెయ్యిలు, లక్షలు పెట్టుకున్నారు..
ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నీటి కోసం
ప్రజలు అల్లాడుతున్నారు.
రేపటి నీటి ఎద్దడిని గుర్తించి..
నేటి నుంచే నీటిని పొదుపు చేయడం
ప్రతి ఒక్కరి బాధ్యత!
ప్రభుత్వాలు మేల్కొని గ్రామాలు,
పట్టణాల్లో నీటి సంరక్షణపై
అవగాహన కల్పించాలి.
లేదంటే ప్రజల దాహం పాలకుల
వైఫల్యానికి నిదర్శనంగా మారుతుంది!
నేడు నీటిని కాపాడితేనే..
రేపటి తరాలకు జీవాన్ని అందించగలం!
నీటిని పొదుపు చేద్దాం..
ప్రకృతిని కాపాడుదాం..
భవిష్యత్తును భద్రపరుచుకుందాం!

తలారి నరసింహా.,
కోట్ పల్లి

2047 వికసిత్ భారత్ లక్ష్యం..
రాష్ట్రాల సహకారం అవసరం

- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచుతాం
- పెట్టుబడులకు ప్రభుత్వ భరోసా ఉంటుందని ముఖ్యమంత్రి ప్రకటన

హైదరాబాద్, ప్రజా వాయిస్:2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యానికి రాష్ట్రాల సహకారం అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో కాదని స్పష్టం చేశారు. సమాఖ్య వ్యవస్థకు ఎంతో బలం ఉందని, ఆధునిక కాలంలోనూ పరస్పర సహకారం, భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య వాణిజ్య మండలి ఆధ్వర్యంలో ప్రారంభమైన సమాఖ్య వ్యాపార సదస్సు–2026లో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మూడు దశల్లో తెలంగాణ అభివృద్ధి

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి, ప్రత్యేక అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్‌ఈ) గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇక్కడ ఐటీ, సేవారంగం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (పీయూఆర్‌ఈ) గా తీర్చిదిద్దుతూ తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, రవాణా–సరుకు నిర్వహణ రంగాలను ప్రోత్సహిస్తామని చెప్పారు.మిగిలిన గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్) గా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయాధారిత

మిగతా 2లో

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టుకు ఒవైసీ

- ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను సవాలు చేస్తూ పిటిషన్
- ఫారం–6లో అదనపు ప్రకటనలు చేర్చడంపై అభ్యంతరం
- సాఫ్ట్‌వేర్ గుర్తింపుల ఆధారంగా ఓటర్లను అనర్హులుగా ప్రకటించొద్దని విజ్ఞప్తి
- ఎన్నికల డిజిటల్ వ్యవస్థలపై స్వతంత్ర తనిఖీకి కమిటీ ఏర్పాటు చేయాలని కోరిన ఎంపీ
- అధికారిక రికార్డులు, అంతర్గత ఉత్తరప్రత్యుత్తరాలు వెల్లడించాలని అభ్యర్థన
- ఇతర ప్రతిపక్ష నేతల పిటిషన్లతో కలిపి విచారణకు తీసుకోవాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓటర్ల నమోదు విధానాలు, ఫారం–6లో అదనపు నిబంధనలు, సాఫ్ట్‌వేర్ ఆధారంగా గుర్తింపులు, ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై ఆయన తన పిటిషన్‌లో ప్రశ్నలు లేవనెత్తారు.

ఫారం–6లో అదనపు షరతులపై అభ్యంతరం

కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు సమర్పించే ఫారం–6లో ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా అదనపు ప్రకటనను చేర్చడంపై ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పిటిషన్ వివరాలు సూచిస్తున్నాయి. చట్టంలో నిర్దేశించిన నిబంధనలకు మించి సాఫ్ట్‌వేర్ మార్పులు లేదా కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా కొత్త షరతులు విధించరాదని ఆయన కోరారు.

మిగతా 2లో

నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం

- రెస్టారెంట్‌లో భోజనం.. యువకుడి మృతి!
- వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన తర్వాత అస్వస్థత
- 19 ఏళ్ల సాయిరాం మృతి.. మరో 15 మందికి అనారోగ్యం
- మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- ఆహార నాణ్యతపై అనుమానాలు
- విచారణకు స్థానికుల డిమాండ్
- మృతికి భోజనమే కారణమా.. తేల్చాల్సిన అధికారులు

2లో

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ
- అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులకు ఇళ్లు
- క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
- మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్దిదారుల ఎంపిక-
- వచ్చే బతుకమ్మ నాటికి తొలి విడత లబ్దిదారులకు ఫ్లాట్ల అప్పగింత లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల కేటాయింపునకు ప్రణాళిక

మేడ్చల్, ప్రజా వాయిస్: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదని, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా పారదర్శక పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

బహిరంగ డ్రాతో ఫ్లాట్ల కేటాయింపు

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా

మిగతా 2లో

ఆధ్యాత్మికత ముసుగులో వేధింపుల ఆరోపణలు

- జూబ్లీహిల్స్ గురూజీపై కేసు నమోదు
- శ్రీ చైతన్య గురూజీ అలియాస్ సునీల్‌రెడ్డిపై పోలీసుల కేసు
- సాధనల పేరుతో భార్యకు అసభ్య సందేశాలు పంపినట్లు భర్త ఫిర్యాదు
- దాంపత్య జీవితంలో సమస్యలు సృష్టించాడని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆరోపణ
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 71లో శ్రీవిద్యా సాధనా కేంద్రం
- కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోలీసులు



2లో

ఎస్ఐఆర్‌పై సమరశంఖం..
హైదరాబాద్‌లో లక్ష మందితో కాంగ్రెస్ సభ

- ఈ నెల 24న ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు
- ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా జాతీయ నేతలకు ఆహ్వానం
- ఓట్ల తొలగింపు ఆరోపణలపై దేశవ్యాప్త ఉద్యమానికి కార్యాచరణ
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు విపక్షాల డిమాండ్
- ఢిల్లీ రాంలీలా మైదాన్ లో నవంబర్ 1న సభపైనా కూటమి చర్చ

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్), ఓట్ల తొలగింపు ఆరోపణలు, కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విమర్శలతో ఇండియా కూటమి దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సభకు సుమారు లక్ష మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జాతీయ స్థాయి నాయకులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఓటర్ల జాబితాల అంశాన్ని దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చాలని విపక్షాలు భావిస్తున్నాయి.

జాతీయ నేతల రాకకు సన్నాహాలు

హైదరాబాద్‌లో ప్రతిపాదిత సభకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే వారి పర్యటనలు, సభా వేదిక, సమయానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంతో పాటు ఇతర అనువైన ప్రదేశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. భారీ జనసమీకరణ నేపథ్యంలో రవాణా, భద్రత, వాహనాల నిలిపివేత, ఇతర ఏర్పాట్లపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఓట్ల తొలగింపుపై విపక్షాల పోరు

ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా జరగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలను

మిగతా 2లో

మందుబాబులకు షాక్

- విదేశీ మద్యం ధరలు పెంపు
- ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు పెరుగుదల
- తెలంగాణలో 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరల సవరణ
- సగటున ఆరు శాతం వరకు పెరిగిన ధరలు
- అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి
- స్కాచ్, సింగిల్ మాల్ట్, ప్రీమియం మద్యం బ్రాండ్లపై అదనపు భారం
- బాటిల్‌పై ముద్రించిన గరిష్ట చిల్లర ధరను పరిశీలించాలని సూచన

2లో

2047 వికసిత్ భారత్ లక్ష్యం..
రాష్ట్రాల సహకారం అవసరం

మొదటి పేజీ తరువాయి

రంగాలు, గ్రామీణ ఉపాధికి పెద్దపీట వేస్తామని వివరించారు.

దేశ జీడీపీలో వాటా పెంచుతాం

ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. దీన్ని పది శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశవిదేశాల వ్యాపారులకు చార్మినార్ గుర్తింపుగా నిలిచిందని, ప్రస్తుతం హైదరాబాద్ వ్యాపార రంగానికి హైటెక్ సిటీ మరో ముఖ్యమైన కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు కార్పొరేట్ సంస్థలకు సేవలందించే స్థాయిలో ఉన్న స్థానిక యువత, సొంతంగా పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా బలపడుతున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ కేంద్రాల నిర్వహణలోనూ మహిళలను భాగస్వాములను చేస్తున్నామని వివరించారు.సమాఖ్య వాణిజ్య మండలి యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మంచి విధానాలను కొనసాగిస్తామని, పెట్టుబడులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంతో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రెండు రోజుల పాటు సదస్సు

సమాఖ్య వ్యాపార సదస్సు–2026 రెండు రోజుల పాటు హైటెక్స్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కె. రఘురామ కృష్ణంరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్ తదితరులు హాజరయ్యారు.

డబ్బుంటే చాలు.. రాజకీయాల్లోకి రావొచ్చు

- మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి పై బీజేపీ నేత లావణ్య గౌడ్ వ్యాఖ్యలు
- మల్కాజిగిరి నుంచి బీజేపీ తరఫున ప్రీతి రెడ్డి పోటీ చేస్తారంటూ ప్రచారం
- ఎన్నికల్లో రూ.300–400 కోట్లు ఖర్చు చేస్తారంటూ లావణ్య గౌడ్ వ్యాఖ్య
- పార్టీ కోసం కష్టపడే సామాన్య కార్యకర్తలకు గుర్తింపు ఏదని ప్రశ్న
- మోదీ, దేశంపై అభిమానంతో ఆమెకు ఓటేయాల్సి వస్తుందంటూ వ్యాఖ్య
- బీజేపీలోనే కాదు.. అన్ని పార్టీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విమర్శ

హైదరాబాద్, ప్రజా వాయిస్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి రాజకీయ ప్రవేశంపై తెలంగాణ రాజకీయాల్లో చర్చ జోరందుకుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానం నుంచి బీజేపీ తరఫున ఆమె పోటీ చేయవచ్చనే ప్రచారం నేపథ్యంలో బీజేపీ మహిళా నేత చారకొండ లావణ్య గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఆర్థికంగా బలమైనవారికి రాజకీయాల్లో అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని, పార్టీ కోసం కష్టపడే సామాన్య కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదని ఆమె విమర్శించారు.

రూ.300–400 కోట్ల ఖర్చుపై వ్యాఖ్యలు

ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య గౌడ్ మాట్లాడుతూ.. ప్రీతి రెడ్డి తమ పార్టీలోకి వచ్చే అవకాశం ఉందని, ఆమె లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కోసం రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఖర్చు అంచనా ఆమె వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ప్రీతి రెడ్డి లేదా బీజేపీ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

కార్యకర్తల కష్టానికి గుర్తింపు ఎక్కడ?

పార్టీ కోసం నిరంతరం పనిచేసే సామాన్య కార్యకర్తలకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని లావణ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళా కార్యకర్త పార్టీ కార్యక్రమాల కోసం బస్సుల్లో హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్నారని, పార్టీపై అపారమైన అభిమానం ఉన్నప్పటికీ అలాంటి వారికి తగిన అవకాశాలు దక్కుతున్నాయా అని ప్రశ్నించారు.డబ్బున్నవారు సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా సులభంగా రాజకీయాల్లోకి వచ్చి విజయాలు సాధిస్తున్నారని విమర్శించారు. బీజేపీలోనే కాకుండా అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మోదీపై, దేశంపై అభిమానంతో పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఓటేయాల్సి వస్తుందని ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

బీజేపీలో ఐక్యత ఉంటే విజయం సాధ్యమే

తెలంగాణలో తమ పార్టీ నాయకుల మధ్య ఐక్యత ఉంటే ఆరు నెలల్లో అధికారంలోకి రావచ్చని లావణ్య గౌడ్ అభిప్రాయపడ్డారు. ఇతరుల మద్దతుపై ఆధారపడకుండా, రాష్ట్ర నాయకులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే విజయం సాధించడం సులభమని పేర్కొన్నారు.

ప్రీతి రెడ్డి రాజకీయ ప్రవేశంపై ఉత్కంఠ

ప్రీతి రెడ్డి కొంతకాలంగా ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుండటంతో ఆమె రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు పెరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన నేపథ్యంలోనూ ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే, ఆమె బీజేపీలో చేరడం, మల్కాజిగిరి నుంచి పోటీ చేయడం, పార్టీ టికెట్ కేటాయింపు వంటి అంశాలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. లావణ్య గౌడ్ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలుగానే చూడాల్సి ఉంది.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టుకు ఒవైసీ

మొదటి పేజీ తరువాయి

సాఫ్ట్‌వేర్ ఆధారిత గుర్తింపులపై ప్రశ్నలు

సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన గుర్తింపులు లేదా అభ్యంతరాల ఆధారంగానే ఓటర్లను అనర్హులుగా ప్రకటించకూడదని ఒవైసీ కోరినట్లు సమాచారం. చట్టబద్ధ విధానాలను అనుసరించకుండా ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన పేర్లపై సమీక్ష చేపట్టాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ప్రస్తావన

ఒవైసీ తరఫు న్యాయవాది నిజాముద్దీన్ పాషా బుధవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇతర పిటిషన్లు కూడా విచారణకు రానున్న నేపథ్యంలో, ఒవైసీ పిటిషన్‌ను వాటితో కలిపి గురువారం విచారించాలని కోరారు. పిటిషన్‌ను పరిశీలించి సంబంధిత కేసులతో కలిపి విచారణకు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి సూచించినట్లు సమాచారం.

రికార్డుల వెల్లడి, ప్రక్రియ నిలిపివేతకు విజ్ఞప్తి

ఎస్ఐఆర్‌కు సంబంధించి ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం ఆధారంగా తీసుకున్న రికార్డులు, అంతర్గత దస్త్రాల నోట్లు, ఉత్తరప్రత్యుత్తరాలు, న్యాయపరమైన సలహాలను వెల్లడించాలని ఒవైసీ కోరినట్లు తెలుస్తోంది. పిటిషన్‌పై తుది విచారణ పూర్తయ్యే వరకు ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కూడా అభ్యర్థించినట్లు సమాచారం. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టబద్ధతను సమర్థిస్తూ గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరినట్లు పిటిషన్ వివరాలు పేర్కొంటున్నాయి.

ఇతర ప్రతిపక్ష నేతల పిటిషన్లు కూడా

ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ప్రతిపక్ష నేతలు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగత రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తదితరులు ఈ పిటిషన్లలో ఉన్నట్లు సమాచారం.

నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం

మెదక్, ప్రజా వాయిస్: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురికాగా, వారిలో సాయిరాం అనే 19 ఏళ్ల యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో 15 మంది అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రెస్టారెంట్‌లో ఆహార నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

భోజనం తర్వాత అస్వస్థత

నర్సాపూర్–మెదక్ రహదారిలో ఉన్న వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో మండి బిర్యానీతో పాటు ఇతర ఆహార పదార్థాలు తీసుకున్న తర్వాత కొందరు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. బాధితులను కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది.

యువకుడి మృతి.. కుటుంబంలో విషాదం

అస్వస్థతకు గురైన వారిలో సాయిరాం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవించే కుటుంబానికి ఈ ఘటన తీరని విషాదాన్ని మిగిల్చింది. కుటుంబానికి అండగా ఉంటాడని ఆశించిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఆహార నాణ్యతపై అనుమానాలు

ఈ ఘటనతో రెస్టారెంట్‌లో ఆహార తయారీ, నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత, తాగునీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు తీసుకున్న ఆహార నమూనాలను సేకరించి పరీక్షించడంతో పాటు, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తే అనారోగ్యానికి అసలు కారణాన్ని గుర్తించే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అధికారులు స్పందించాలి

నర్సాపూర్‌లోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ కేంద్రాల్లో ఆహార భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని పట్టణవాసులు కోరుతున్నారు. వంటగదుల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, వంట నూనెల నాణ్యత, తాగునీటి స్వచ్ఛత, అనుమతుల వంటి అంశాలపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు సాయిరాం మృతిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఫిర్యాదు అందిన తర్వాత పోలీసుల విచారణతో పాటు సంబంధిత శాఖల పరిశీలనలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. బాధితుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ, యువకుడి మృతికి గల కారణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించి, తప్పు చేసినట్లు తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికత ముసుగులో వేధింపుల ఆరోపణలు

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఆధ్యాత్మిక సాధనల పేరుతో ఓ మహిళను వేధించారన్న ఆరోపణలపై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీ చైతన్య గురూజీగా పిలుచుకునే సునీల్‌రెడ్డిపై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విష్ణుదీప్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం.

అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణ

జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 71లోని శ్రీవిద్యా సాధనా కేంద్రాన్ని సునీల్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సాధనల పేరుతో తన భార్యకు అసభ్యకరమైన, అభ్యంతరకరమైన సందేశాలు పంపడంతో పాటు వ్యక్తిగతంగా చాటింగ్ చేస్తున్నారని విష్ణుదీప్‌రెడ్డి ఆరోపించారు.

దాంపత్య జీవితంలో కలతలు

వివాహమైన కొన్ని నెలల నుంచే తన భార్య తనను పట్టించుకోవడం తగ్గించిందని, గురూజీ సందేశాలు తమ దాంపత్య జీవితంలో సమస్యలకు కారణమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులకు 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని పొంగులేటి వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకూ ప్రాధాన్యం

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.440 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌పై సమరశంఖం..
హైదరాబాద్‌లో లక్ష మందితో కాంగ్రెస్ సభ

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం అధికారిక రికార్డులు, సంబంధిత వివరాల ఆధారంగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, ఈ అంశం విపక్షాల రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా మారింది.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించే అంశాన్ని పరిశీలించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలన్న డిమాండ్‌నూ ముందుకు తెస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

దేశవ్యాప్త నిరసనలకు ప్రణాళిక

ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఓట్ల తొలగింపు ఆరోపణలపై ఉమ్మడి కార్యాచరణ గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దసరా తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కూటమి భావిస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ సభ నిర్వహించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర ప్రాంతాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టే అంశంపై నేతలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లోని పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

నిరసన వేదికలపై ఆంక్షలపై విమర్శలు

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఆంక్షలపై కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉండాలని, నిరసనలు తెలిపేందుకు తగిన వేదికలు అందుబాటులో ఉండాలని వారు పేర్కొంటున్నారు. ఒక ప్రాంతంలో నిరసనలకు ఆంక్షలు విధిస్తే ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించినట్లు సమాచారం. మరోవైపు రాహుల్ గాంధీపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తుండటంతోనే బీజేపీ విమర్శలకు దిగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతిపాదిత సభ ద్వారా జాతీయ స్థాయిలో ఓటర్ల జాబితాల అంశాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు తెలంగాణలో పార్టీ శ్రేణులను సమీకరించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. అయితే సభ నిర్వహణ, నేతల హాజరు, జనసమీకరణపై తుది వివరాలు అధికారిక ప్రకటన తర్వాత స్పష్టమయ్యే అవకాశం ఉంది.

మందుబాబులకు షాక్

హైదరాబాద్, ప్రజా వాయిస్:తెలంగాణలో విదేశీ మద్యం ధరలు పెరిగాయి. బ్రాండ్‌ను బట్టి ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు ధరలు సవరించినట్లు సమాచారం. సగటున ఆరు శాతం వరకు ధరల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. సవరించిన ధరలు అక్టోబర్ 12 నుంచే అమల్లోకి వచ్చినట్లు అధికారిక సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

352 బ్రాండ్ల ధరల సమీక్ష

రాష్ట్రంలో ప్రస్తుతం విక్రయిస్తున్న 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరలను ప్రభుత్వం సమీక్షించింది. టెండర్ కమిటీ సమర్పించిన నివేదిక, సిఫారసులను పరిశీలించిన అనంతరం ధరల సవరణకు ఆమోదం తెలిపింది. అన్ని బ్రాండ్ల ధరలను ఒకే విధంగా పెంచకుండా, ఒక్కో బ్రాండ్‌ను బట్టి మార్పులు చేసినట్లు సమాచారం.

ప్రీమియం బ్రాండ్లపై ప్రభావం

స్కాచ్, సింగిల్ మాల్ట్ విస్కీలు, ప్రీమియం వోడ్కా, జిన్, వైన్ వంటి దిగుమతి బ్రాండ్ల ధరలు కూడా పెరిగినట్లు తాజా ధరల సవరణలో వెల్లడైంది. దీంతో ఆయా బ్రాండ్లను కొనుగోలు చేసే వినియోగదారులపై అదనపు భారం పడనుంది.

కొత్త ధరల ప్రకారమే విక్రయాలు

అక్టోబర్ 12 నుంచి డిపోల ద్వారా సరఫరా చేసే మద్యం నిల్వలపై సవరించిన గరిష్ఠ చిల్లర ధరల స్టిక్కర్లు తప్పనిసరిగా వేయాలని తెలంగాణ రాష్ట్ర పానీయాల సంస్థ అధికారులు డిపో నిర్వాహకులకు సూచించినట్లు సమాచారం. మద్యం దుకాణాలు, బార్ల యజమానులు కూడా కొత్త ధరల జాబితా ప్రకారమే విక్రయాలు జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

నల్లగొండకు నీళ్లివ్వకుండా అడ్డుకుంటున్నారు

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- సాగునీరు అందక నల్లగొండ రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన
- జిల్లాకు నీళ్లివ్వొద్దంటూ సీఎం మీద అధికారుల ఒత్తిడి ఎందుకని ప్రశ్న
- నీళ్లన్నీ పాలమూరుకే కావాలనడం సరికాదని వ్యాఖ్య
- డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపులపై అభ్యంతరాలేంటని నిలదీత
- పాలమూరులో రిజర్వాయర్లు ప్రారంభమైనా నీటి తరలింపునకు సరైన ప్రణాళిక లేదని విమర్శ

నల్లగొండ, ప్రజా వాయిస్: నల్లగొండ జిల్లాలో సాగునీరు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు పాలకులపై ఒత్తిడి తీసుకొస్తూ జిల్లాకు నీళ్లు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం నల్లగొండలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన సాగునీటి కేటాయింపుల అంశంపై మాట్లాడారు.

నల్లగొండకు నీళ్లివ్వొద్దా?

నీళ్లన్నీ పాలమూరు ప్రాంతానికే కావాలని కోరడం సరికాదని గుత్తా అన్నారు. డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చేయవద్దని అనడం ఏమిటని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాకు నీళ్లు ఎలా ఇస్తారంటూ ముఖ్యమంత్రిపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇతరుల ఒత్తిళ్లకు తలొగ్గి ముఖ్యమంత్రి లేదా మరెవరైనా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

ఏడు లక్షల ఎకరాలకే సాగునీరు

నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ఏడు లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని గుత్తా తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి కేటాయింపులపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.మరోవైపు పాలమూరు ప్రాంతంలో 25 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు ప్రారంభమైనప్పటికీ, వాటికి నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలన్న అంశంపై సరైన ప్రణాళిక లేదని విమర్శించారు. జిల్లాల మధ్య సాగునీటి పంపిణీ విషయంలో సమతుల్యత పాటిస్తూ రైతులకు న్యాయం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, నల్లగొండకు సాగునీటి కేటాయింపులపై అధికారుల ఒత్తిడి ఉందన్న గుత్తా ఆరోపణలపై సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందన తెలియాల్సి ఉంది.

జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పంజ సంపత్ కుమార్ ఎన్నిక పట్ల హర్షం

ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పంజ సంపత్ కుమార్ ఎన్నికపట్ల సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు, ఈమేరకు పంజ సంపత్ కుమార్ కు బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు బండారి బాల్రెడ్డి మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్ని మండలాల్లో వర్కింగ్ జర్నలిస్ట్లందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇప్పించాలని అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంపత్ కుమార్ పంజ కృషి చేయాలని ఆయన కోరారు అదేవిధంగా ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ , సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు ఎల్లారెడ్డి పేట వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో నైన రగుడు వెంకటాపూర్ బైపాస్ రోడ్ లో అయినా ఇప్పించాలని అదేవిధంగా ఉచిత బస్సు పాసులు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఎల్లారెడ్డిపేట వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సంఘం తరఫున కృషి చేస్తానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంపత్ పేర్కొన్నారు, ఈ సన్మాన కార్యక్రమంలో జర్నలిస్టులు పెంటం శ్రీనివాస్, ఓగ్గు బాలరాజు యాదవ్, ఓగ్గు మహేష్ యాదవ్, పోతుల గాంధీబాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తూరి ప్రవీణ్ రెడ్డి గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు,

అన్నపూర్ణాదేవిగా కట్టమైసమ్మ....
దర్శనానికి పోటెత్తుతున్న భక్తజనం..!

- బుద్వేల్ టీచర్స్ కాలనీలో భక్తి సందడి
- ప్రత్యేక పూజలు,మహా అన్నప్రసాదంతో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు
- పోతురాజు యాదయ్య విజయలక్ష్మి దంపతులు
- పందుల విజయలక్ష్మి కుటుంబ సభ్యులు

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:అమ్మవారి నామస్మరణతో మార్మోగుతున్న ఆలయం. భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ప్రాంగణం.రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి పారవశ్యంతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు

ఆలయ ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజల్లో గండిపేట మండలం టియుడబ్ల్యూ (ఐజెయు)కార్యనిర్వహక కార్యదర్శి,ఏడబ్ల్యూఏ కమిటీ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ రిపోర్టర్,పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు, శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య విజయలక్ష్మి దంపతులు,పందుల విజయలక్ష్మి కుటుంబ సభ్యులు,పాల్గొని అమ్మవారిని పూజించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రగడమ్‌పల్లి శ్రవణ్ కుమార్, టీచర్స్ కాలనీ అధ్యక్షుడు నందిగామ నరసింహ, శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయి మాలిక్, బాలు,టిచర్ సురేష్,రాజేందర్,కుమార్, రాజేందర్ పాండే,సాయి కుమార్,ఓగిరాల హరికృష్ణ,శివ,భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు మహా అన్నప్రసాదం

ప్రత్యేక పూజల అనంతరం పోతురాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులకు అమ్మవారి దర్శనంతో పాటు అన్నప్రసాదం అందించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతుండటం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు కోరని శ్యామ్,కోరని నరేందర్ తెలిపారు. రానున్న రోజుల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట అభివృద్ధికి అందరూ కలిసి రావాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్గ్రామ సర్పంచ్ బోయ అశోక్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం
- రూ. 40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైప్ లైన్ పనులకు నిధులు కేటాయింపు

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనం మరియు డ్వాక్రా మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లాంఛనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శంకరన్న మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వెల్లడించారు పర్వతాపూర్ గ్రామానికి ఇప్పటివరకు 37 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, సుమారు రూ. 40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు అంతేకాకుండా గ్రామంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా 107 వీధి దీపాలను మంజూరు చేసినట్లు వివరించారు తన పర్యటనలో భాగంగా పర్వతాపూర్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని ఎమ్మెల్యే శంకరన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుచరిత కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనిత జితేందర్ రెడ్డి, పర్వతాపూర్ గ్రామ సర్పంచ్ బోయ అశోక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదిక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సర్పంచులు ఆంజనేయులు, అమర్నాథ్ రెడ్డి, నర్సింహులు, జంగయ్య, రాజ్ కుమార్, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ రత్నమ్మ రాములు, మాజీ డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాకేష్, వార్డు సభ్యులు సరిత నర్సింహులు, పద్మమ్మ, మల్లేష్, సునీత, అశోక్, నర్సింహులు, నాయకులు శ్యాంసుందర్, జంగయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఐసీ కమిటీ సమావేశంలో 54 ఎజెండా అంశాలకు ఆమోదం

- రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి
- రుణాల మంజూరు, వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బ్యాంకు కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజా వాయిస్ సంగారెడ్డి : జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో మంజూరు చేయడంతో పాటు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బుధవారం సంగారెడ్డిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్ చార్జి కమిటీ చైర్మన్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన పీఐసీ సమావేశం, జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ (DLMRC) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన పర్సన్ ఇన్ చార్జి కమిటీ సమావేశంలో 54 ఎజెండా అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమావేశంలో బ్యాంకు కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, రుణాల మంజూరు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పంట రుణాలు, ఇతర రుణ సదుపాయాలను సకాలంలో అందించాలని తెలిపారు. మంజూరు చేసిన రుణాల వసూళ్లను వేగవంతం చేసి, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులో డిపాజిట్లను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సులభతరంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు.బ్యాంకు ఆర్థిక పరిస్థితి, వ్యాపార లావాదేవీలు, నిర్దేశిత లక్ష్యాల సాధనలో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, బ్యాంకు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు.బ్యాంకు అభివృద్ధితో పాటు రైతుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా, రికవరీ శాతం తక్కువగా ఉన్న రామాయంపేట, సంగారెడ్డి లోకల్ బ్రాంచ్, ఝరాసంగం, శంకరంపేట-ఆర్, సిద్దిపేట-2 శాఖల అధికారులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని సూచించారు.

జైపూర్ పోలీస్ స్టేషన్‌లో రామగుండం సీపీ ఆకస్మిక తనిఖీ

- రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు
- నేరాల నియంత్రణ, సీసీటీఎన్ ఎస్ నిర్వహణపై సీపీ అంబర్ కిషోర్ ఝా సమీక్ష.

ప్రజా వాయిస్ జైపూర్.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ మరియు సిబ్బంది విధుల తీరును పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల వివరాలు, వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్ఐ భూమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీటీఎన్ఎస్ రికార్డులు, ఆన్‌లైన్ కేస్ వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన సీపీ, ప్రతి అధికారికి టెక్నాలజీపై పూర్తి పట్టు ఉండాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో ఎలాంటి అలసత్వం వహించకూడదని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో '5S మేనేజ్‌మెంట్' విధానాన్ని అమలు చేస్తూ రికార్డులు, పని ప్రదేశాలను క్రమబద్ధంగా, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి

ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్లను' గుర్తించి, హెచ్చరిక బోర్డులు, సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకపోవడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై, అలాగే ఇళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీపీ వెంట జైపూర్ ఏసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్ తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

భీమిని మండలములో దారుణం

- వడాల్ గ్రామంలో వృద్ధురాలి పత్తి చేనును గడ్డి మందు కొట్టి ధ్వంసం చేసిన దుండగులు.
- గడ్డి మందు చల్లారని ఇద్దరిపై ఆరోపణలు
- లక్షన్నర రూపాయల నష్టం.

ప్రజా వాయిస్ భీమిని. మంచిర్యాల జిల్లా భీమిని మండలం వడాల్ గ్రామ శివారులోఒక వృద్ధురాలికి చెందిన పత్తి పంటను కొందరు వ్యక్తులు గడ్డి మందు కొట్టి పూర్తిగా ధ్వంసం చేసిన అమానుష ఘటన వెలుగు చూసింది.బాధితుడి పిర్యాదు మేరకు సుమారు 1.5 లక్షల రూపాయల (లక్షన్నర) మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

ఘటన వివరాల్లోకి వెళితే

.వడాల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు అకిరెడ్డి బాలక్క. భర్త పోచయ్య పేరిట వడాల్ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 352/2/3/ మరియు 293/3లలో నాలుగు ఎకరాల ఇరవై గుంటలు (4.20) వ్యవసాయ భూమి ఉన్నది. ఈ ఏడాది జూలై 2026 లో ఆమె కుమారుడు అకిరెడ్డి శంకర్ ఆ భూమిలో పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత కాయ దశకు చేరుకుంది. ఈ క్రమములో అదే మండలానికి చెందిన ఏ శ్రీనివాస్.మరియు ఏ నిరంజన్ అనే ఇద్దరు వ్యక్తులు పాత కక్షలను మనసులో ఉంచుకుని అక్రమంగా చేనులోకి చొరబడి పత్తి పంట పై తీవ్రమైన గడ్డిమందు(కలుపునివారణ మందు) చల్లారు.దీనితో చేతికి రావాల్సిన పత్తి పంటపూర్తిగా ఎండిపోయి మాడి మాసైపోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్ళముందే నాశనం కావడంతో బాధితులు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పెట్టుబడి కష్టం అంతా బూడిద పాలై లక్షన్నర రూపాయల నష్టం వాటిల్లిందని కన్నీరు మున్నిరవుతున్నారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

.స్థానిక భిమిని పోలీస్ స్టేషన్ లో గతంలోనే (సెప్టెంబర్ 24.26.29.తేదీల్లో) పిర్యాదు చేసినప్పటికీ సరియైన పరిష్కారం లభించక పోవడంతో బాధితుడు అకిరెడ్డి శంకర్ బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ACP)మరియు సోమవారం రోజున రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ (CP)అంబర్ కిషోర్ ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి పంటను ధ్వంసం చేసిన నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

రహదారులపై ఆక్రమణలకు చెక్

- అక్రమ పార్కింగ్ వాహనాల తొలగింపు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, ప్రజలు మరియు వాహనదారుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చేసేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. రహదారులపై అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలపై దృష్టి సారించి వాటిని తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కాల్వ శ్రీరాంపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై డివైడర్ పక్కన అక్రమంగా నిలిపిన వాహనాలను ఎస్ఐ చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి తొలగించారు. రహదారులపై ఆటోలు, జీపులు తదితర వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు.అలాగే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కిరాణా దుకాణాల ముందు ఏర్పాటు చేసిన ఆక్రమణలను, రహదారిని ఆనుకుని నిర్వహిస్తున్న పండ్ల దుకాణాలను మున్సిపల్ కమిషనర్ రమేష్, సిబ్బందితో కలిసి తొలగించారు.పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ చంద్రకుమార్ సూచించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రాకపోకలకు ఆటంకాలు కలగకుండా వ్యవహరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తి ముసుగులో వ్యాపారం.. వినాయక విగ్రహాలకు ఈ దుస్థితా..!

- పండుగ వేళ పూజలు..ఆ తర్వాత చెత్తలో విగ్రహాలు.!
- మణికొండలో వ్యాపారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం
- గౌరవ ప్రధంగా తక్షణమే తరలించాలని విజ్ఞప్తి చేస్తున్న భక్తులు

ప్రజావాయిస్//రాజేంద్రనగర్:వినాయక చవితి వేళ దేవుడి విగ్రహాలను విక్రయించి సొమ్ము చేసుకున్న వ్యాపారులు..పండుగ ముగియగానే వాటిని రోడ్డుపై వదిలేసి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నార్సింగి సీఎంసీ సర్కిల్ మణికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో, భారత్ పెట్రోల్ పంపు పక్కన,ఆర్టీఓ కార్యాలయానికి ఎదురుగా వినాయక విగ్రహాలు దుమ్ము,ధూళి, చెత్తాచెదారం మధ్య కనిపించడం ఆవేదన కలిగిస్తోంది.అమ్మేటప్పుడు భక్తి..ఆ తర్వాత బాధ్యత లేదా.? దేవుడి విగ్రహాలు వ్యాపార వస్తువులేనా.? లాభాలు ఆర్జించిన తర్వాత వాటి పట్ల కనీస గౌరవం చూపాల్సిన బాధ్యత లేదా.? వినాయక విగ్రహాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం హిందూ సంప్రదాయాల పట్ల గౌరవం లేని చర్యగా స్థానికులు భావిస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విగ్రహాలను గౌరవప్రదంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద రెండు రోజుల్లో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్.
- ప్రజల రాత్రి వేళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్థల పరిశీలన.

ప్రజా వాయిస్ బోథ్.ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి వేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, అక్కడ నూతనంగా ఏర్పాటు చేయనున్న హైమాస్ట్ లైట్ స్థలాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెండు రోజుల్లో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రజల సౌకర్యం, రాత్రి వేళల్లో రాకపోకలు సులభతరం కావడం, ప్రమాదాల ముప్పు తగ్గించడం లక్ష్యంగా హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

- ఓదెలలో తప్పిపోయిన యువతి.. బంధువులకు క్షేమంగా అప్పగింత

ప్రజా వాయిస్ పోత్కపల్లి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ పోత్కపల్లి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో తిరుగుతున్న మతిస్థిమితం లేని యువతిని గుర్తించి, ఆమె వివరాలు సేకరించి బంధువులకు క్షేమంగా అప్పగించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్, పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామంలో మంగళవారం రాత్రి ఓ యువతి తిరుగుతున్నట్లు గ్రామ సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ సనత్ రెడ్డి సూచనల మేరకు బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శివశంకర్ వెంటనే అక్కడికి చేరుకుని యువతి వివరాలు సేకరించారు. విచారణలో ఆమె వరంగల్‌కు చెందిన యువతిగా గుర్తించారు. అనంతరం ఆమె బంధువులను సంప్రదించి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకున్న తర్వాత యువతిని క్షేమంగా అప్పగించారు. ఆపదలో ఉన్న యువతికి సాయం అందించి, ఆమెను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన పోలీసుల తీరుపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు.

లాల్గాడి మలక్‌పేట్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- నూతన గృహంలోకి అడుగుపెట్టిన కావటి సరిత, మురళి దంపతులు
- శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి

శామీర్ పేట / అక్టోబర్ 14 (ప్రజా వాయిస్): పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్గాడి మలకపేట్ గ్రామానికి చెందిన కావటి సరిత, మురళి దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో బుధవారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన సరిత, మురళి దంపతులకు చైర్‌పర్సన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సొంతింటిని నిర్మించుకోవడం ప్రతి పేద కుటుంబానికి ఒక గొప్ప కల అని, ఆ కల నెరవేరినప్పుడు ఆ కుటుంబంలో ఆనందం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఆమె అన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందాలిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరినప్పుడే వాటి అసలైన లక్ష్యం నెరవేరుతుందని చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సొంత ఇల్లు కుటుంబానికి భద్రతను, సమాజంలో గౌరవప్రదమైన జీవనాన్ని అందిస్తుందని తెలిపారు. పేదల అభ్యున్నతి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దోహదపడతాయని ఆమె వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు నూతన గృహాల్లో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆమె ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కరువైందా..? నాయకత్వంపై అసంతృప్తా..?

- కాంగ్రెస్ కు దుద్దు ఆకాష్ గుడ్ బై..!
- యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా
- బీఆర్ఎస్ లో చేరికతో నార్సింగిలో రాజకీయ చర్చ
- ఆకాష్ నిర్ణయం వెనుక అసలు కారణాలేంటి.?
- మరో ఇద్దరు మాజీ కౌన్సిలర్లు కూడా పార్టీ మారనున్నారా.?

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:గండిపేట మండలం నార్సింగి రాజకీయాల్లో యువ నాయకుడి పార్టీ మార్పు ఆసక్తికర చర్చకు తెరలేపింది.రాజేంద్రనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుద్దు ఆకాష్ కాంగ్రెస్ పార్టీకి,తన పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు.మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు.కీలక పదవిలో ఉన్న యువ నాయకుడు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నాయకత్వంపై అసంతృప్తా..? గుర్తింపు దక్కలేదా..?

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవిలో ఉన్న దుద్దు ఆకాష్ పార్టీని వీడటంతో అసలు కారణాలపై ఆసక్తి నెలకొంది.పార్టీలో తగిన గుర్తింపు లభించలేదా.? నాయకత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం అందలేదా.? స్థానికంగా రాజకీయ ఎదుగుదలకు అవకాశాలు లేక అసంతృప్తికి గురయ్యారా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.మీడియా ముందుకు వచ్చి ఆకాష్ మాట్లాడితేనే అసలు విషయాలు అన్ని బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి.సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన దుద్దు ఆకాష్‌కు సబితా ఇంద్రారెడ్డి స్వాగతం పలికారు.యువ నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.బీఆర్ఎస్‌పై విశ్వాసంతో పార్టీలోకి వస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ కు రాజీనామా.. బీఆర్ఎస్ లో కొత్త రాజకీయ ప్రయాణం

కాంగ్రెస్‌లో కొనసాగిన ఆకాష్ ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరడంతో తన రాజకీయ ప్రయాణానికి కొత్త దారి ఎంచుకున్నారు. సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఆకాష్ బాటలో మరికొందరు?

దుద్దు ఆకాష్ పార్టీ మార్పుతో నార్సింగిలో మరిన్ని రాజకీయ పరిణామాలపై చర్చ సాగుతోంది.నార్సింగి మున్సిపాలిటీకి చెందిన మరో ఇద్దరు మాజీ కౌన్సిలర్లు కూడా త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు స్థానికంగా ప్రచారం జోరుగా జరుగుతోంది.ఈ ప్రచారం నిజమైతే స్థానిక రాజకీయాల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.యువ నాయకుడికి కాంగ్రెస్‌లో గుర్తింపు దక్కలేదా.? నాయకత్వంతో విభేదాలున్నాయా.? లేక రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నారా.? మరోవైపు, నార్సింగిలో మరికొందరు నాయకులు కూడా పార్టీ మారుతారనే ప్రచారం స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎలాంటి మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

యూనియన్ బ్యాంకు లో దళారులదే హవా

- ప్రతి లోనుకు ఒక రేటు
- వాటాలు పంచుకుంటున్న .అధికారులు దళారులు
- బ్యాంక్ అంటేనే బెబ్బెలెత్తుతున్న రైతులు
- నీరుకుల్లా గ్రామంలో వారసత్వంగా కొనసాగుతున్న అటెండర్ జాబులు

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్ గ్రామీణ ప్రాంతాల నిరుపేద ప్రజలకు రైతులకు వ్యాపారులకు అందుబాటులో ఉండాలని ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు లో అధికారులకు కంటే దళారుల దేహవా.. ప్రతి లోనుకు ఒక రేటు నడుస్తుంది. బుధవారం ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామంలోని యూనియన్ బ్యాంకు లో ఏ లోను కావాలన్నా కూడా ముందుగా దళారులను ఆశ్రయించవలసింది. వారికి పర్సంటేజ్ ఇస్తేనే రైతులకు రుణాలు, వ్యాపారులకు కానీ పర్సనల్ లోన్స్ కానీ మంజూరవుతాయి. డైరెక్ట్ గా అధికారుల దగ్గరికి వెళితే వారు ముందుగా వెళ్లి గుండాల వీరన్న ను కలవండి అప్పుడే మీకు లోన్ వస్తుంది అని సమాధానం చెప్తారని పలువురు రైతులు అంటున్నారు. అందుకు నిదర్శనం గానే మండలంలోని అగ్రంపాడు గ్రామానికి చెందిన రాజన్న యొక్క అల్లుడు అయినటువంటి దుగ్గొండి మండలం గుడ్డెలుగుల పల్లె గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతు బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకునేందుకు వెళ్లగా బ్యాంక్ అధికారులు పలుమార్లు తిప్పడంతో దళారిని ఆశ్రయించారు. వెంటనే లోన్ మంజూరు చేయించి లక్ష రూపాయల లోనుకు 6000 రూపాయలు ఇవ్వాలని రైతును డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు అధికారులు రైతులకు స్వయం ఉపాధి కోసం వ్యాపార వ్యాపారం చేసుకునే వారికి రుణాలు ఇవ్వకుండా చెప్పులు అరిగేలా తిప్పుకుంటున్నారని యూనియన్ బ్యాంకు పరిధిలోని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . బ్యాంకు చుట్టూ తిరగలేక అవసరము కోసం దళారులకు పర్సంటెజులు ఇవ్వడం తప్పడం లేదని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా అటెండర్ పోస్టులు మూడు తరాలు ఒకటే కుటుంబానికి చెందిన వ్యక్తులు కొనసాగడం బ్యాంకు అధికారులపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి దళారుల వ్యవస్థ లేకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నారు.

వారసులు లేరని ఆస్తిపై కన్ను.. 1975 పట్టా భూమికి ఎసరు!

- మాజీ కౌన్సిలర్ పారుపల్లి తిరుపతి సహా ఆరుగురిపై ఆరోపణలు
- సర్వే నంబర్ మార్చి ప్లాట్లుగా విక్రయం
- ప్రశ్నిస్తే చంపుతామని బెదిరింపులు.. స్పందించని అధికారులు

ప్రజా వాయిస్ మంచిర్యాల జిల్లా /క్యాతనపల్లి తమకు ఏకైక జీవనాధారమైన ఐదు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి, ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని ఒక వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని, పైగా తమను ప్రాణాలతో తీసివేస్తామని బెదిరిస్తున్నారని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చెగ్యం బొందయ్య ఆవేదన వ్యక్తం చేశారు.వృద్ధుడైన చెగ్యం బొందయ్య తెలిపిన వివరాల ప్రకారం.. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో గల సర్వే నంబర్ 341లో 1975 నాటి ప్రభుత్వం వీరికి 5 ఎకరాల సీలింగ్ భూమిని పట్టాగా కేటాయించింది. నాటి నుండి ఆ భూమిలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, వృద్ధాప్యంలో ఉన్న తమకు వారసులు ఎవరూ లేక పోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు భూబకాసురులు ఆ స్థలంపై కన్నేశారు.సర్వే నంబర్ 341లో ఉన్న ఐదు ఎకరాల భూమిని.. సర్వే నంబర్ 340గా చూపుతూ అక్రమంగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని బొందయ్య ఆరోపించారు. ఈ కబ్జా పర్వంలో మాజీ కౌన్సిలర్ పారుపల్లి తిరుపతితో పాటు చిప్పరి తిరుపతి, చిప్పరి లక్ష్మి , చిప్పరి లక్ష్మీనారాయణ, దోమల పోషం, పారుపల్లి శంకర్ అనే ఆరుగురు వ్యక్తులు ప్రమేయం ఉందని ఆయన పేర్లు వెల్లడించారు.తమ భూమిని కాపాడుకునేందుకు ఆర్టీఐ (RTI) ద్వారా దరఖాస్తు చేసుకుని, తమకున్న హక్కులకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను సేకరించినట్లు వృద్ధ దంపతులు తెలిపారు. ఈ అక్రమాలపై మున్సిపల్ కమిషనర్, స్థానిక పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. పైగా, "మాపైనే ఫిర్యాదులు చేస్తారా? దిక్కులేని మిమ్మల్ని ప్రాణాలతో ఉంచం" అని సదరు వ్యక్తులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రోదించారు. తమ భూమిని కబ్జా చేయడమే కాకుండా ప్రాణ బెదిరింపులకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వృద్ధ దంపతులు చెగ్యం బొందయ్య ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తమకు న్యాయం చేయాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ లను వారు బహిరంగంగా అర్థించారు.

తిలక్ వాకర్స్ ఆధ్వర్యంలో నేత్ర దాన కార్యక్రమం

- అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంటెవాడ నగేష్

ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన మత్తమారి చంద్రశేఖర్ మృతి చెందారు. వారికి సంబందించిన నేత్ర దాన కార్యక్రమం తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు తిలక్ వాకర్స్ అసోసియేషన్ తరుపున ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని భగవంతుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు మత్తమారి సూరిబాబు, తిలక్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంటెవాడ నగేష్, సభ్యులు శ్రీనివాస్ రాజు,సుకుమార్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో గంజాయి కలకలం

- 33 గ్రాముల పదార్థం స్వాధీనం
- వేముల నర్వ శివారులోని స్టోన్ క్రషర్ గదిలో పోలీసుల తనిఖీలు
- ఒకరిపై కేసు నమోదు

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వేముల నర్వ గ్రామ శివారులో గంజాయి కలకలం చోటుచేసుకుంది ఆర్కాన్ మినరల్స్ స్టోన్ క్రషర్ ప్రాంగణంలోని ఓ గదిలో గంజాయి ఉన్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి సుమారు 33 గ్రాముల గంజాయిగా అనుమానిస్తున్న పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు ఈ ఘటనకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామకృష్ణ పటేల్ (31)పై కేసు నమోదు చేశారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీ సాయంత్రం షాద్‌నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అడ్డాకుల శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, క్లూస్ బృందం, పంచ సాక్షులతో కలిసి స్టోన్ క్రషర్ ప్రాంగణంలోని ఓ గదిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గది గోడకు వేలాడదీసిన నల్లటి కవర్‌లో ఎండిన ఆకులు, పువ్వుల మాదిరిగా ఉన్న పదార్థాన్ని గుర్తించారు. అదే గదిలో నివసిస్తున్న రామకృష్ణ పటేల్ వద్ద లభించిన ఈ పదార్థాన్ని పంచ సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. దాని నికర బరువు సుమారు 33 గ్రాములుగా గుర్తించారు.ఈ ఘటనపై కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎస్ఐ బి. పరమేష్ దర్యాప్తు చేపట్టారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు

పోచారం లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం

- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మేడ్చల్ జిల్లా / అక్టోబర్ 14 (ప్రజా వాయిస్): అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధి విషయంలో ఎలాంటి వివక్షకు తావులేదని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు చోటు లేదని, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.హైదరాబాద్ నగరంలో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, నగరంలోనే జీవనోపాధి పొందుతున్న పేదలకు వారు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే గౌరవప్రదమైన నివాసాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పేదలను ఉపాధికి దూరంగా ఉన్న ప్రాంతాలకు తరలించడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంక్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు. 23 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, ఇప్పటికే ఆరు ప్రాంతాల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారిని గుర్తించడంతో పాటు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. స్థానికంగా నివసిస్తూ, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికే ఇళ్లను కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల మంజూరు...

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. తొలి విడతలో అవకాశం లభించని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో పాటు అర్హులందరి దరఖాస్తులను పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.

ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా ఇళ్ల హక్కులు

ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని మంత్రి స్పష్టం చేశారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్ పత్రాల్లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సైతం పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి తెలిపారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఇప్పటికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వివరించారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ...

అనంతరం మంత్రులు కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి. గౌతమ్, జిల్లా కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి తదితరులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ

- 20 లక్షల కేంద్రం నిధులతో అభివృద్ధి పనులు

.ప్రజా వాయిస్ పాట్నాపూర్ /బోత్ బోథ్ మండలం పట్నాపూర్ గ్రామపంచాయతీలో 20 లక్షల డి ఎ జీ యు జి ఎ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టానున్న అభివృద్ధి పనులకు ఈరోజు సర్పంచ్ పంద్రం సుగుణ భూమి పూజా చేసి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేసిన ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ కి బోథ్ శాసన సభ్యుడు అనిల్ జాదవ్ కి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమం లో ఉప సర్పంచ్ ఆత్రం మోహన్ పంచాయతీ సెక్రటరీ స్వామి పటేల్. తోడషం నిలకాంత్ రావ్. మాజీ సర్పంచ్ తోడషం గోపాల్ గోడం పురుషోత్తం. ఆడేం పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

వల్మిడి సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి శంఖు చక్ర దీపాల బహుకరణ

- స్వామివారి సేవలో భాగస్వాములైన 1990–91 ఎస్ ఎస్ సీ బ్యాచ్ పాలకుర్తి.
- పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించిన ఈఓ, అర్చకులు.

ప్రజా వాయిస్ ప్రతినిధి/పాలకుర్తి నియోజకవర్గం/అక్టోబర్ 14జనగామ జిల్లా, పాలకుర్తి మండలం వల్మిడి:వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి జెడ్పీహెచ్ఎస్ పాలకుర్తి పాఠశాలలో 1990–91 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శంఖు, చక్ర దీపాలను భక్తిశ్రద్ధలతో బహుకరించారు.ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. స్వామివారి ఆలయానికి దీపాలను బహుకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు భక్తులు, పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం

- 18 తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం
- జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, బోథ్ శాఖా గ్రంథాలయ నూతన భవన స్థల స్వీకరణపై కీలక నిర్ణయం

.ప్రజా వాయిస్ బోథ్ ఆదిలాబాద్.జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదిలాబాద్ సర్వసభ్య సమావేశం బుధవారం సంస్థ కార్యాలయంలో ఛైర్మన్ డాక్టర్ మల్లెపూల నరసయ్య అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని గ్రంథాలయాల సమగ్ర అభివృద్ధి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు మరియు పాఠకులకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సాగిన ఈ సమావేశంలో మొత్తం 18 ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, అన్ని తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ డాక్టర్ మల్లెపూల నరసయ్య మరియు కార్యదర్శి పి. సురేష్ బాబు మాట్లాడుతూ..బోథ్ శాఖా గ్రంథాలయ నూతన భవన నిర్మాణం కొరకు అనువైన స్థలాన్ని స్వీకరించడంతో పాటు ఇందవెల్లి శాఖా గ్రంథాలయాన్ని మరింత అనుకూలమైన ప్రదేశానికి తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే విరాళ నిధుల సద్వినియోగం, 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వినియోగానికి సభ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి (DEO) మాధవి, జిల్లా పంచాయతీ అధికారి (DPO) రమేష్, జిల్లా పౌర సంబంధాల అధికారి (DPRO) విష్ణు, వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు (DD) శ్రీనివాస్ రెడ్డి మరియు సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు పాల్గొన్నారు.

బాబానగర్ లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

- ప్రజలకు మెరుగైన రోడ్ల సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం..
- 48 లక్షలతో పనులకు శంకుస్థాపన..
- కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన మున్సిపల్ ఛైర్మన్ యూనుస్, టౌన్ ప్రెసిడెంట్ నరేష్ గౌడ్

ప్రజా వాయిస్ జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా జహీరాబాద్ మున్సిపల్ పట్టణ పరిధిలోని బుధవారం 6వ వార్డు బాబానగర్ రంజోల్ లో రూ. 48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ ఛైర్మన్ మహమ్మద్ యూనుస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్ శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారులు సక్రమంగా ఉంటే ప్రయాణం సులభతరం అవడంతో పాటు స్థానిక ప్రజలకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వార్డుల వారిగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు.బాబానగర్ రంజోల్ ప్రాంతంలో రూ. 48 లక్షల వ్యయం తో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. రహదారుల అభివృద్ధి వల్ల ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలగడంతో పాటు వాహనదారులకు కూడా ప్రయాణం సులభతరం ఉంటుందని అన్నారు. అదేవిధంగా పట్టణ అభివృద్ధిలో ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుంటూ ముందుకు సాగుతామని ఛైర్మన్ పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా పట్టణంలోని బాబానగర్ లో సిసి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక కౌన్సిలర్ జనాభాయి, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, వార్డు ప్రజలు మున్సిపల్ ఛైర్మన్ మహమ్మద్ యూనుస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, డీఈ మహేష్, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

దళితుల ఓట్లు కావాలి..గుడిలోకి మాత్రం రావొద్దా ?

- ఎమ్మెల్యే సొంతూరిలోనే దళితులకు అవమానమా ?
- మంగంపల్లి ఘటనపై అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల ఆగ్రహం
- పూర్తి వివరాలు సేకరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

ప్రజా వాయిస్.. వనపర్తి దళితుల ఓట్లు కావాలి.. కానీ వారు గుడిలోకి మాత్రం రావొద్దా? ప్రజాస్వామ్యంలో ఇలాంటి వివక్షకు చోటెక్కడుందని అఖిలపక్ష ఐక్యవేదిక ప్రశ్నించింది. ఎమ్మెల్యే మెగా రెడ్డి సొంతూరిలోనే, ఎమ్మెల్యే మామ దళితుల ఆలయ ప్రవేశానికి అడ్డుపడుతున్నారనే ఆరోపణలు వస్తే.. సామాన్య ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్తుందని నిలదీసింది. మంగంపల్లిలో చోటుచేసుకున్న ఘటనను ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐక్యవేదిక నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల మంగంపల్లిలో జరిగిన ఘటనకు సంబంధించి గ్రామానికి వెళ్లి దళితులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఇది ఒక్కరోజు జరిగిన ఘటన కాదని, గత 40 ఏళ్లుగా గ్రామంలోని దళితులకు ఆలయంలోకి ప్రవేశించే అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలోకి వెళ్లకుండా బయటే ఉండి మొక్కుకోవాలంటూ చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఓట్ల కోసం దళితులు ఆలయ ప్రవేశానికి మాత్రం అడ్డంకులా ?

దళితులను అంటరానివారిగా చూసే ధోరణి నేటికీ కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఇలాంటి వివక్షాపూరిత చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.మంగంపల్లి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను డాక్టర్ సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని, గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో డాక్టర్ సతీష్ యాదవ్, గంధం నాగరాజు, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, బిజెపి రవి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు

గ్రామీణ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

- ఆర్ అండ్ బి అధికారులకు వినతి..
- వినతి పత్రం అందజేసిన బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రావణ్

.ప్రజా వాయిస్ జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని తాండూర్, మొగుడంపల్లి, కోహీర్, వెల్మే ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రావణ్ తెలిపారు. రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం ఆర్ అండ్ బీ అధికారులకు వినతిపత్రం అందజేసి, ఆయా రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాండూర్, మొగుడంపల్లి, కోహీర్ రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరారు. అంతేకాకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమ్యం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

మణికొండ పాఠశాలకు కొత్త భవనం

- 10 తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన
- పీఎంశ్రీ పథకం కింద నిధుల మంజూరువిద్యార్థులకు మెరుగైన వసతులే లక్ష్యం
- ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది నూతన తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన చేశారు. పీఎంశ్రీ పథకం కింద నిధులు మంజూరు కావడంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.నూతన భవన నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు,విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా సౌకర్యాలు కల్పించడం ద్వారా నాణ్యమైన విద్యకు తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.నూతన తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థులకు మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ,ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐచర్ వ్యాన్ ను వెనుక నుండి ఢీకొట్టిన కారు
- తీవ్రంగా గాయపడిన సర్వేయర్ తతాంగ గోవింద్ రావు
- మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ కు తరలింపు.

ప్రజా వాయిస్ గుడిహత్నూర్.ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజక వర్గంలోని గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బుధవారం భయానక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో కారు తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కుచ్చాలాపూర్ గ్రామానికి చెందిన సర్వేయర్ తతాంగ గోవింద్ రావు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన సామాజిక కార్యకర్తలు ఆడే జైపాల్, కాగ్నే రాంకిషన్ క్షణాల్లో స్పందించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ దిలీప్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.. తీవ్రంగా గాయపడిన గోవింద్ రావును మెరుగైన వైద్యం కోసం ప్రథమ చికిత్స అనంతరం వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాహనదారులు పరిమితి వేగాన్ని పాటిస్తూ, రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు.

బతుకమ్మ ఘాట్ ని ఆనుకొనిఉన్న పల్లెప్రకృతివనంలో బుద్ధుని విగ్రహం

ప్రజా వాయిస్ గూడూర్ సద్దులబతుకమ్మ సందర్భం గావెంగంపేట పల్లెప్రకృతివనంలో ప్రారంభయిన పారిశుధ్య పనులు రాబోయేసద్దులబతుకమ్మ,విజయదశమి పండుగల నేపథ్యంలోవెంగంపేట గ్రామంలోని బతుకమ్మ ఘాట్ ని ఆనుకొనిన్న పల్లెప్రకృతివనం లో గ్రామఆడబిడ్డలు,చిన్నపిల్లలు సేదతీరడం కోసంచెత్త,ముళ్లపొదలు,పిచ్చిచెట్లు తొలగించి,వాకింగ్ ట్రాక్,మరియు చిన్నపిల్లల ఆట విడుపుకోసం ఏర్పాటుచేసిన కిడ్స్ ప్లే గ్రౌండ్ ప్రాంతాన్ని శుభ్రం చేసి,పార్క్ పరిసరాలు మొత్తం వాడుకలోకి తీసుకురావడం జరిగింది,దాని తోబాటు పార్కుమధ్యలో నెలకొల్పిన బుద్ధుడు మరియు బతుకమ్మ ఘాట్ దగ్గర గల శివుడు,సత్యా హరిచంద్ర విగ్రహాలకు నూతనంగా రంగులద్దడంతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి, ఈ పనులన్నీటిని దగ్గరుండి చేపిస్తున్న గ్రామ సర్పంచ్ గుగులోత్ జవహర్ మరియు పాలకవర్గాన్ని గ్రామప్రజలు అభినందించారు.

భక్త మార్కండేయ దేవాలయంలో చండీ అవతార పూజలు

- నిత్య పూజలు, అభిషేకాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్‌లోని పూసాల భక్త మార్కండేయ దేవాలయంలో నాలుగో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని చండీ అవతారంలో అలంకరించి, కూష్మాండ పూజతో పాటు నిత్య పూజా కార్యక్రమాలను చేపట్టారు.ఉత్సవాల్లో భాగంగా సర్వతోభద్ర మండల పూజ, నవగ్రహ పూజ, బ్రహ్మ కలశానికి, అమ్మవారికి నిత్య అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పూసాల గ్రామంతో పాటు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ వలస భాస్కర్, బీకాం శంకరయ్య, పి.కిషన్, పెగడ ఆంజనేయులు, అడిగొప్పుల లింగమూర్తి, ఉడ్నాల రమేష్, శ్రీరాముల శంకర్, కండక్టర్ శంకరయ్య, కంకణాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫామ్ పాండ్ల నిర్మాణాలు నిబంధనల ప్రకారం చేపట్టాలి

- రైతు సేవా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి
- ఫామ్ పాండ్ల నిర్మాణాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ముత్తారం మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్
- డ్రిప్ సేద్యంతో నీటి పొదుపు
- రైతులకు అవగాహన కల్పించాలి
- కూలీల హాజరు, కూలి చెల్లింపుల వివరాలు నమోదు చేయాలి.
- ప్రతి మండలంలో ఐదు ఫామ్ పాండ్ల పనులపై పర్యవేక్షణ.
- జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ప్రజా వాయిస్/పాలకుర్తి నియోజకవర్గం/అక్టోబర్ 14జనగామ జిల్లా, పాలకుర్తి: రైతులకు సాగునీటి కొరత లేకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టి, అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేలా ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. అదే సమయంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫామ్ పాండ్ల పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం.

పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లి గ్రామంలో చేపడుతున్న ఫామ్ పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లోతు, ఎత్తు, పొడవులతో ఫామ్ పాండ్లను నిర్మించాలని స్పష్టం చేశారు.ప్రతి మండలంలో ఐదు ఫామ్ పాండ్లను ఎంపిక చేసి, వాటి నిర్మాణ పనులను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. రోజువారీగా పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య, వారికి చెల్లిస్తున్న కూలి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరును తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, పనులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపరచాలని సూచించారు.రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు చైతన్యం కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ ఉత్పాదకాల పరిశీలన.

అనంతరం పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలోని మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో రైతులకు అందిస్తున్న సేవలు, విక్రయిస్తున్న వ్యవసాయ ఉత్పాదకాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, విత్తనాల నిల్వలను పరిశీలించారు.ప్రధాన కంపెనీలకు చెందిన నాణ్య మైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ ఎరువు ల నిల్వలు ఎంత ఉన్నాయి? వాటి విక్రయాలు ఎలా జరుగుతున్నాయి? అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డ్రిప్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి.

తక్కువ నీటితో పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు డ్రిప్ సేద్యం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ తెలిపారు. రైతు సేవా కేంద్రంలో డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉంచుతున్నారా? ఇప్పటివరకు ఎంతమంది రైతులకు వాటిని అందించారు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రిప్ పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలు వ్యవసాయ రంగంలో చురుకైన పాత్ర పోషిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ భాస్కర్, డీఏఓ అంబికా సోనీ, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లికార్జున, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్‌తో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రూ.6.06 కోట్ల పనులకు శ్రీకారం

- నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదు
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు
- అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి అంటూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచనలు

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:బండ్లగూడ, కిస్మత్‌పూర్ డివిజన్లలో రూ.6.06 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.సీసీ రోడ్లు,భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులతో కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి.దర్గా ఖలీజ్ ఖాన్,ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రి ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ,ఓమ్ నగర్,ఆనంద్ నగర్, బండ్లగూడ వార్డు కార్యాలయ రోడ్డు,ప్రశాంత్ నగర్,కిస్మత్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీల్లో ఈ పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేపట్టడమే కాదు,వాటిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేసినట్లు తెలిపారు.పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ప్రజాధనంతో చేపట్టే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా,నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రహదారులు,డ్రైనేజీ సౌకర్యాలు అందించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులకు కోతలు లేకుండా విద్యుత్ అందించాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ఎదుట ధర్నా.
- రైతులనుమోసం చేస్తున్నకాంగ్రెస్ ప్రభుత్వ

ప్రజా వాయిస్ కొత్త గూడ విద్యుత్ కోతలు లేకుండా వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్ మాట్లాడుతూ. విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై విద్యుత్ కోతల ప్రభావం తీవ్రంగా ఉన్నదని , పంటలకు సాగునీరు అందించడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల గృహ వినియోగదారులతో పాటు వ్యాపారులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఎల్ నీనో ప్రభావం తెలిసి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సిగ్గు చెటని ఆరోపించారు. విద్యుత్ కోతలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వడంతో పాటు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, రైతులకు అవసరమైన విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు . విద్యుత్ సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. లేని యడల ప్రభుత్వ ద్వంద వైఖరి పై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఈసం స్వామి , అధికార ప్రతినిధి నెహ్రు నాయక్,భూపతి తిరుపతి, కాసర్ల సాంబయ్య, అజ్మీర రమేష్,వాసం వెంకన్న,లింగన్న, దేవేందర్ రావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యకు గురైన దళిత యువకుడి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

- ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్.

ప్రజా వాయిస్.బుగ్గారం/ నేరెడిగొండ.ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజక వర్గంలో నేరెడిగొండ మండలంలోని బుగ్గారం గ్రామంలో జూన్ 17న కిరాతకంగా హత్యకు గురైన బుగ్గారం గ్రామానికి చెందిన నాతరి సతీష్ బాధిత కుటుంబానికి పరామర్శించారు.బాధితులకు పరిహారం, ఉపాధి కల్పించకపోతే జిల్లావ్యాప్త ఆందోళనలు తప్పవని కూడల స్వామి, ఆరెల్లి మల్లేష్ హెచ్చరించారు.నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన దళిత యువకుడు నాతరి సతీష్ (25) హత్యకు గురై నాలుగు నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడల స్వామి, జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కూడల స్వామి, ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ..జూన్ 17న కుల వివక్షతో పథకం ప్రకారం సతీష్‌ను తీసుకెళ్లి దారుణంగా హత్య చేసి బోథ్ కరత్ వాడ ప్రాజెక్టులో పడేసిన నిందితులపై కేసులు నమోదైనప్పటికీ, ఆర్థికంగా చితికిపోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందలేదన్నారు. భర్తను కోల్పోయి, ఇద్దరు కుమార్తెలు ఉన్న ఆ తల్లికి ఆసరాగా నిలిచిన కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చట్టపరమైన పరిహారం, పునరావాసం, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని, జాప్యానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు గజ్జల శంకర్, కారెం రవి, సంతోష్, రొడ్డ గంగన్న, అశోక్, సారంగ రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్.. వ్యక్తి మృతి

ప్రజా వాయిస్ టేక్మాల్:

టేక్మాల్ మండలంలోని షాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని దండువాని కుంట తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి విస్లావత్ అనిల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. విస్లావత్ అనిల్ ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఘటనతో దండువాని కుంట తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనిల్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓబీసీల హక్కుల పరిరక్షణే లక్ష్యం: శ్రీధర్ యాదవ్

ఆర్కే పురం కార్యాలయాన్ని తొలిసారి సందర్శించిన ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి

శాలువాతో సత్కరించిన ధీరజ్

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:
ఓబీసీల సంక్షేమం,హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి బైతి శ్రీధర్ యాదవ్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆర్కే పురంలోని కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధీరజ్..శ్రీధర్ యాదవ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఇరువురూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ భేటీలో ఓబీసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ,వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓబీసీ వర్గాల సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ యాదవ్ పేర్కొన్నారు. తనకు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఓబీసీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పరిగి, కొడంగల్ బార్లకు 16న లాటరీ

జిల్లా ఆబ్కారీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజావాయిస్/వికారాబాద్:
వికారాబాద్ జిల్లాలోని పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల పరిధిలో బార్ల కేటాయింపునకు ఈ నెల 16న లాటరీ నిర్వహించనున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పరిగి బార్‌కు 36, కొడంగల్ బార్‌కు 27 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటలకు లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ప్రవేశ అనుమతి పత్రంతో హాజరుకావాలని, సెల్‌ఫోన్లను బయట భద్రపరిచి లోపలికి రావాలని సూచించారు. ఇతర వివరాలకు 8712658729 నంబరును సంప్రదించాలని కోరారు.

రైతులతో ముచ్చటించి వారు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్న

వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంతో పాటు కడిపికొండ,కుమ్మరిగూడెం చుట్టుపక్కల రైతులతో ముచ్చటిస్తూ వారి సాగు వివరాలు, పంటలకు అవసరమైన నీటి సరఫరా గురించి ఆరా తీసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు . అనంతరం పంటలకు నీరు ఇబ్బందిగా ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నీటిని దఫాల వారీగా అందించాలని ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కావాలంటే రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

మా ఉపాధి మాట విని.. అండగా నిలిచిన సమ్మన్న గౌడ్ !

చైతన్యనగర్ మహిళలకు రూ. 25,000/-లతో 25 జతల కోలాటం గజ్జెల పంపిణీ

సమ్మిగౌడ్ తో 2 దశాబ్దల బంధం.. బిడ్డలా,ప్రతీ కుటుంబం తో అనుబంధం - సి ఎన్ ఆర్ కాలనీ మహిళలు

మహిళల ఉపాధికి చేయూతనిస్తూ మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు..

ప్రజా వాయిస్,కేసముద్రం
ఉపాధి కోసం కోలాటం ఆడతామని అడిగిన మహిళల మాట విని, వారి అవసరాన్ని తన బాధ్యతగా భావించి వెంటనే స్పందించారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన 25 మంది మహిళలు తమ గ్రూప్ లీడర్ కొమ్ము ఎల్లమ్మతో కలిసి వచ్చి, ఉపాధి కోసం గ్రూప్ కోలాటం కార్యక్రమాలకు వెళ్లేందుకు ఒకే రంగు దుస్తులతో పాటు కాళ్ల గజ్జెలు అవసరమని కోరారు. మహిళల నోట ఉపాధి మాట వినగానే వారి కష్టాన్ని అర్థం చేసుకున్న సమ్మయ్య గౌడ్ వెంటనే స్పందించి రూ, 25,000/– వ్యచ్చించి 25 జతల కోలాటం గజ్జెలను అందించి తన మానవీయతను చాటుకున్నారు. అంతకుముందు 25 మంది మహిళలకు కోలాటం చీరలను కూడా పంపిణీ చేశారు. చైతన్యనగర్ కాలనీతో సమ్మయ్య గౌడ్‌కు ఉన్నది కేవలం 26 ఏళ్ల పరిచయం మాత్రమే కాదు..ప్రతీ మనిషి తో బంధం, ప్రతీ కుటుంబం తో అంతకుమించిన ఆత్మీయ అనుబంధం. ఆ కాలనీ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా, తన అక్కా, చెల్లెళ్లుగా భావిస్తూ.. అన్నదమ్ముల్లా వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అండగా నిలుస్తున్నారు. కాలనీలో ఎవరికి ఏ ఆపద వచ్చినా, ఎవరైనా మరణించినా సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యుడిలా తోడుగా ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఉపాధి కోసం ముందుకు వచ్చినప్పుడు వారి అవసరాన్ని గుర్తించి సహాయం చేయడం ఆయనకు వారిపట్ల ఉన్న అభిమానానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొమ్ము ఎల్లమ్మ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా మా కాలనీలో ఎవరికీ ఏ కష్టం వచ్చినా మా కుటుంబంలో పుట్టిన బిడ్డలా స్పందిస్తూ, అన్నదమ్ముల్లా మా కష్టసుఖాల్లో తోడుంటున్నారు. ఉపాధి కోసం మేము ఏది అడిగినా కాదనకుండా సహాయం చేస్తున్నారు. మమ్మల్ని, మా జాతిని తన కుటుంబంలా భావించి కొండంత ప్రేమ చూపిస్తున్న మా కొడుకు, మా అన్న సమ్మన్నకు ఎల్లవేళలా రుణపడి ఉంటాం. మా బృందం, చైతన్యనగర్ కాలనీ తరపున ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని భావోద్వేగంగా పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- చైర్‌పర్సన్‌గా అనిత రమేష్ నాయక్, వైస్ చైర్మన్‌గా మధులత శ్రీనివాస్ చారి బాధ్యతల స్వీకరణ

ప్రజా వాయిస్/కోట్ పల్లి:
రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌గా అనిత రమేష్ నాయక్, వైస్ చైర్‌పర్సన్‌గా మధులత శ్రీనివాస్ చారితో పాటు నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ మార్కెట్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం 21 మంది లబ్ధిదారులకు రూ. 21,02,436 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను, అర్హులైన వారికి డిజిటల్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్, మండల అధ్యక్షుడు తేనె రాంచంద్రారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మహాచండీ అమ్మవారి కృపతో సకల శుభాలు

త్రిశక్తుల స్వరూపిణిగా మహాచండీ అమ్మవారు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/
ములుగు జిల్లా కేంద్రంలోని శ్రీ రామాలయంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని మహాచండీ రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపాలుగా మహాచండీ అమ్మవారు విరాజిల్లుతారని ఆధ్యాత్మిక పెద్దలు పేర్కొంటారు. అమ్మవారిని భక్తితో ఆరాధించే వారికి దృష్టిదోషాలు తొలగి, సకల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసమని తెలిపారు.

మహాచండీ ఆరాధనతో భక్తులకు ఆధ్యాత్మిక శక్తి
మహాచండీ అమ్మవారి పూజకు శక్తి ఆరాధనలో విశిష్ట స్థానం ఉందని, అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిలో, ఆధ్యాత్మిక చింతనలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నాయి.

భక్తులకు అన్నప్రసాద వితరణ:
నాలుగో రోజు ఉత్సవాల సందర్భంగా కవిత, శ్రీనివాస్ రెడ్డి, బండవరం రాజేష్, పొగాకుల సునీల్ గౌడ్, కనకయ్య సంయుక్తంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, గట్ల సత్యనారాయణ రెడ్డి, ఏళ్ళ మధుసుదన్ దంపతులు, ఇమ్మడి రాకేష్ యాదవ్, చింతలపూడి చిన్న కొండారెడ్డి, ఏలూరి నారాయణరెడ్డి, బాణాల రాజ్ కుమార్, బోగిరి రాకేష్, గుండెబోయిన రమేష్, గంగిశెట్టి రాజ్ కుమార్, సానికొమ్ము శ్రీనాథ్ రెడ్డి, నగరపు రమేష్, ఇంద్రసేనారెడ్డి, మాలోత్ చందన నల్లెల ధృవన్, దొంత రెడ్డి వెంకట్ రెడ్డి, పెరబోయిన విజయ్, తంగిరాల గౌతంరెడ్డి, మేడెద్దుల మమన్, బండి రవీందర్, శ్రీరాముల సుమన్, భూక్య సుధీర్, పోరిక జశ్వంత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఐటీఐ, ఏటీసీ నిర్మాణాలతో మరింత అభివృద్ధి

గుడిసె లేని తెలంగాణే లక్ష్యం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ మరియు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ, ఏటీసీ నిర్మాణాలతో విద్యార్థులకు ఉపయోగపడే అనేక కోర్సులు అందుబాటులో ఉంటాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ అగ్రిమెంట్ కు అనుగుణంగా ఆరు నెలల్లోపు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని టెండర్ నిర్వాహకులను ఆదేశించారు.

గుడిసె లేని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం..
గుడిసె లేని తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గుడిసెల్లో నివాసం ఉంటున్న 31 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు, ఏటీసీ ప్రిన్సిపల్ సత్యనారాయణ, తాహశీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు జోజి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విద్యాసాగర్, సోమన్న, గౌరీ శంకర్ ఇన్నా యాజమాన్యం సుధాకర్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు చిత్తలూరి సోమనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు రమేష్, శ్రీకాంత్, అంబేద్కర్, లింగస్వామి కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, సైదులు, సోమిరెడ్డి, సురేష్, పాండు, సందీప్ రెడ్డి, రవి, గంగరాజు, రమేష్, మల్లేష్, రాజశేఖర్ రెడ్డి, సోమన్న, షమీర్ ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది

రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు ?

మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజా వాయిస్.. వనపర్తి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అకింతం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు.ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్ధేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పత్తిలో అధిక దిగుబడుల సాధనకు మెళకువలు

-కోహినూర్ సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

పత్తి సాగులో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ, సరైన పంట యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని కోహినూర్ సీడ్ ఫిలిప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ ప్రతినిధి దేవరబోయిన కిషన్ సూచించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామంలో కోహినూర్ సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో పత్తి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతికి చెందిన పత్తి చేనులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి సాగులో అనుసరించాల్సిన పద్ధతులు, పంట సంరక్షణ చర్యలు, అధిక దిగుబడుల సాధనకు పాటించాల్సిన మెళకువలపై రైతులకు వివరించారు. పంట ఎదుగుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన దిగుబడుల సాధనకు అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు.మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని దేవరబోయిన కిషన్ సూచించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పంటను సాగు చేస్తూ, సరైన యాజమాన్య చర్యలు చేపట్టడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించడంతో పాటు వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం పత్తి రైతులకు సాగు మెళకువలపై అవగాహన కల్పించేలా సాగింది.

అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన

- రాంపూర్ గ్రామపంచాయతీ అభివృద్ధి మా లక్ష్యం సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్

ప్రజా వాయిస్ తలకొండపల్లి :

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంగాయపల్లి గ్రామంలో 100 ఫీట్లు అండర్ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల--శ్రీశైలం యాదవ్ గారు సంగాయపల్లి నాయకుల తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపే లక్ష్యంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా మురుగునీరు నిల్వ ఉండకుండా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రావడం వల్ల గ్రామంలో మురుగునీటి నిర్వహణ సులభతరం కావడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు దోహదపడుతుందని తెలిపారు.గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు సహకరించాలని సూచించారు.అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, వార్డు సభ్యులు: పెరుమళ్ళ నరేష్ పబ్బ రమేష్, మాజీ ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు: వేదం ఉదయ శంకర్, అనురాధ తిరుపతయ్య,

నాయకులు: వెంకటరెడ్డి, యువ నాయకుడు: పబ్బ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

విద్య వృత్తితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..

సృజన మేకోవర్స్‌లో హోతీ (కే) గర్ల్స్ రెసిడెన్షియల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ హోతి (కే) తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ గర్ల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ వృత్తి విద్యలో భాగంగా దసరా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని జహీరాబాద్‌లోని సృజన మేకోవర్స్‌లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, వృత్తి పరమైన నైపుణ్యాలను ప్రత్యక్షంగా నేర్చుకొని భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ. ఈ కార్యక్రమానికి ఎంతో సహకారం అందిస్తూ, విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యను అభ్యసించడం ఎంతో అవసరమని తెలియజేసి వారిని ప్రోత్సహించారు. వృత్తి విద్యా శిక్షకురాలు టి. భార్గవి ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటున్నారని, విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ రంగంలో ఉపయోగించే వివిధ రకాల ఉత్పత్తులు, వాటి వినియోగం, థ్రెడింగ్, వ్యాక్సింగ్, డీ-టాన్ ఫేషియల్, హెన్నా అప్లికేషన్ వంటి అంశాలపై దశలవారీగా శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని ఆసక్తిగా నేర్చుకుంటూ ప్రాక్టికల్ అనుభవాన్ని పొందుతున్నారని ,ఈ కార్యక్రమాన్ని వృత్తి విద్యా సమన్వయకర్త చైతన్య సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడం జరిగిందని, వృత్తి విద్య ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పనిపట్ల బాధ్యత, స్వయం ఉపాధిపై ఆసక్తి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

మున్నేరు వాగు బతుకమ్మ ఘాట్ వద్ద లైటింగ్ ఏర్పాటు చెయ్యాలి

.సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్

ప్రజా వాయిస్,మహబూబాబాద్

సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ విద్యుత్ ఎ ఈ కివినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపాలిటీ 15ఽ16వార్డులో ఉన్న మున్నేరు వాగు బతుకమ్మ ఘాటు దగ్గర గతంలో వేసిన విద్యుత్ పోల్స్ నేషనల్ హై వే 365 రోడ్డు పై గత సం..లోకురిసిన భారీ వర్షాల వరదల ప్రభావంతో రోడ్డు తెగిపోవడంతో పోల్స్ విరిగి పోవడం జరిగిందని అన్నారు దంతోమహబూబాబాద్ శాసనసభ్యుడు డా .మురళి నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు పున నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు మరియు బతుకమ్మ ఘాటు నిర్మాణానికి నిధులుకేటాయించాలని డిమాండ్ చెయ్యడంతో ఎమ్మెల్యే మురళి నాయక్ నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసారని అన్నారు...బతుకమ్మ ఘాటు దగ్గర రెండు కరెంటు పోల్స్ టౌన్ కరెంట్ ట్రాన్స్ఫర్ అవసరమున్నదని వెంటన్నే ఏర్పాటు చెయ్యాలని అన్నారు..15ఽ16వార్డు మరియు పట్టణ ప్రజలు బతుకమ్మ చివరిరోజు అట పాటలతో భారీగా అక్క చెల్లెళ్ళు ప్రజలు వస్తారని అన్నారు బతుకమ్మ ఘాటు వద్ద కరెంట్ పోల్స్ లైటింగ్ సిస్టమ్ ను వెంటన్నే ఏర్పాటు చెయ్యాలని కోరారు ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు 15వ వార్డు కౌన్సిలర్ బానోత్ బాబు.పసలదిమధు.బొమ్మరినగేష్.యలమకాంటివెంకన్న .విశ్వనాధం.జనగాంశ్రీను.మండవరాజుశ్రీను.గోదావరిభ వానిశంకర్ తదితరులుపాల్గొన్నారు.

వెట్టి చాకిరీని గుర్తించి నిర్మూలించడంలో పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలి

ప్రజా వాయిస్ మహబూబాబాద్

జిల్లాలోని ఇటకబట్టీలు, మార్కెట్ యార్డులు తదితర ప్రదేశాలలో ఏవైనా వెట్టిచాకిరి లాంటి సంఘటనలు జరుగుతున్నాయో పారా లీగల్ వాలంటీర్లు గమనించి సంస్థకు సమాచారం అందించాలని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన వెట్టి చాకిరి నిర్మూలన పథకాన్ని మహబూబాబాద్ జిల్లాలో అమలు చేసేందుకు గాను న్యాయమూర్తి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ వెట్టి చాకిరి నిర్మూలన పథక ఉద్దేశాలను వివరించారు. కొన్ని నెల ల క్రితం నిజామాబాద్ మరియు నల్గొండ జిల్లాలలో ఇటుక బట్టీలలో వెట్టి చాకిరి వ్యవస్థను గుర్తించారని కాబట్టి పారా లీగల్ వాలంటీర్లు అప్రమత్తంగా వ్యవహరించి ఇలాంటి చట్ట వ్యతిరేక పనులను సంస్థ దృష్టికి తీసుకురావాలని కోరారు. పారా లీగల్ వాలంటీర్లు గ్రామీణ ప్రాంతాలలో క్రియాశీలకంగా ఉంటారని కాబట్టి వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థ వంటి రుగ్మతలను రూపుమాపటానికి తమ వంతు కృషి చేయాలన్నారు.పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, బాధితులకు మరియు న్యాయ సేవాధికార సంస్థకు మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో ప్యానెల్ న్యాయవాదులు మరియు జిల్లాకు చెందిన పారా లీగల్ వలంటీర్లు, పాల్గొన్నారు.

పాపన్నపేటలో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు...

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో.....

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని పాపన్నపేటలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. సుధా ట్రేడర్స్ భారతి సిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24 జట్లు పాల్గొన్నాయి. పాపన్నపేట స్థానిక సర్పంచ్ పావని గౌడ్, మరియు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ పోటీలతో మైదానం లో సందడి నెలకొంది. వివిధ పార్టీల గ్రామ మండల నాయకులు,

యువకులు క్రీడా అభిమానులు పాల్గొన్నారు

ప్రజలసంక్షేమంకోసం,పార్టీ బలోపేతంకోసం, అహర్నిశలు శ్రమిస్తున్ననిజమైననాయకుడు

వజ్జ సారయ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహణ

ప్రజా వాయిస్ ,కొత్తగూడ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా నాయకుడు వజ్జ సారన్న పుట్టినరోజు వేడుకలను కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో వజ్జ సారన్న సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..వజ్జ సారన్న ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నిజమైన ప్రజా నాయకుడు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఆయన ఆయురారోగ్యాలతో, సంతోషంగా నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని" ఆకాంక్షించారు.ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగాల ప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సారన్నకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రూ 3,94,000 విలువ గల చెక్కులను అందజేత

స్వయంగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి అందజేసిన మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

జహీరాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితుల లబ్ధిదారులకు పదమూడు చెక్కులకు గాను మొత్తం 3,94,000 రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మండల సర్పంచ్ లు దాసరి మచ్చేందర్,చెల్లా శ్రీనివాస్ రెడ్డి,ఎక్కెళ్ళి రాజు,గోవర్ధన్ రెడ్డి, వెంకట్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులలో చేరి మెరుగైన వైద్యం చేయించుకొని ఆసుపత్రి బిల్లులతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ శాసన సభ్యుడు కొనింటి మాణిక్ రావుని సంప్రదించిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా మంజూరు చేయించిన చెక్కులను లబ్ధిదారుల గ్రామాలకు వెళ్ళి ఇవ్వడం జరిగిందని తట్టు నారాయణ తెలిపారు.అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మాణిక్ రావు గారికి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణకు వివిధ ఆయా గ్రామాల సర్పంచ్ లకు, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు..

పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

- ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు
- ముఖ్య అతిథులుగా :మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ప్రజా వాయిస్ తలకొండపల్లి :

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పరిధిలోని గౌరిపల్లి గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా వేద మంత్రాలతో జరిపించడం జరిగింది. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామికి గ్రహానికి గజస్తం ప్రతిష్టాత్మక నాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి నీ ఆపించడం చాలా సంతోషంగా ఉందని ప్రతి ఒక్కరు భక్తి భావంతో కలిగి ఉండాలని తెలిపారు. గౌరీపల్లి గ్రామవాసులు ప్రతి గడపగడపన ఆంజనేయస్వామి జై శ్రీరామ్ నినాదాలతో గ్రామం మారుమయింది.ఈ కార్యక్రమంలో గౌరిపల్లి కళ్యాణ్, ఉప సర్పంచ్ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ డైరెక్టర్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి గణేష్ గుప్తా, అవాంఛ నరసింహ రాజు రెడ్డి, సర్పంచ్ రామ, లక్ష్మణ్, మాజీ ఎంపిటిసి యాదయ్య, రేణు రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ , రాజేందర్ నాయక్, ఖానాపూర్ జంగయ్య, రాఘవేందర్ గౌడ్,మరియు గ్రామ ప్రజలు గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వీపనగండ్లలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారుల అవగాహన సదస్సు

పెరుగుతున్న సైబర్ నేరాలు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: బ్యాంకు అధికారులు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు సూచించారు.ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు బుధవారం వీపనగండ్లలోని ఐవోబీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) గోపాల్, విజిలెన్స్ అధికారి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐవోబీ వీపనగండ్ల శాఖ మేనేజర్ రఘునందన గుప్తా, డిప్యూటీ మేనేజర్ కే. మధు కుమార్ ఖాతాదారులకు పలు సూచనలు చేశారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ (ఓటీపీ), ఏటీఎం పిన్ నంబర్లు, యూపీఐ వివరాలను గుర్తుతెలియని వ్యక్తులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు ఫోన్ ద్వారా వ్యక్తిగత వివరాలు, రహస్య బ్యాంకింగ్ సమాచారం అడగరనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించేటప్పుడు అపరిచిత లింకులను క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకుంటూ సైబర్ మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఖాతాదారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐవోబీ వీపనగండ్ల శాఖ సిబ్బంది, పరిసర ప్రాంతాలకు చెందిన ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య పనులు

సంబంధిత. మండల.అధికారుల పర్యవేక్షణ కరవు

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే ఉద్యేశ్యంతో కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్పటికి , సంబంధిత జిల్లా. మండల అధికారుల. పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా.మండల సంబంధితఅధికారులు మాత్రం అటువైపుగా కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్లెలే రాష్ట్రానికి పట్టు కొమ్మలని చెప్పడమే తప్ప ఆచరణలో లేదని ప్రజలు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు...ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు,ప్రజా ప్రతినిధులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం లోని నీరుకుళ్ల గ్రామంలో పారిశుధ్య పనులపై నిర్లక్ష్య ధోరణి కళ్ళకు కట్టినట్లు దర్శన మిస్తున్నాయి...బతుకమ్మ,దసరా పండుగల కు కూడా వీధుల్లో చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచడం లో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫల మయ్యారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అధికారులు సైతం ప్రజల సమస్యలపై స్పందించక పోవడం పై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు ఇస్తుంటే ఈ గ్రామంలో మాత్రం పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన గ్రామ అధికారి. గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో చెత్తను గ్రామ అధికారి తొలగించకపోవడంతో ఇళ్లల్లో దుర్వాసన వెదజల్లుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే గ్రామాధికారి పై. మండల అధికారులపై చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 42 మందికి జైలు శిక్షలు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 42 మందికి జైలు శిక్షలు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక తనిఖీలు

మద్యం మత్తులో డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు

వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచన

గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

మద్యం సేవించి వాహనాలు నడిపిన 42 మందికి గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్షలు విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను న్యాయస్థానంలో విచారించగా ఈ శిక్షలు విధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పోలీస్ లు పాల్గొన్నారు.

తొలగించిన చోటే అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ఠ

- అనుమతుల పేరుతో విగ్రహాన్ని తొలగించడం సరికాదు
- జీవో 18 ను రద్దు చేయాలి..
- అక్టోబర్ 14 అంబేద్కర్ బౌద్ధం స్వీకరించిన రోజే విగ్రహం పున ప్రతిష్ట
- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సిద్దిపేట జిల్లా సభ్యులు పి. శంకర్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్:

అనుమతుల పేరుతో తొలగించిన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని అదే స్థలంలో దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠించామని, అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సిద్దిపేట జిల్లా సభ్యులు, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో బౌద్ధ ఆచారం ప్రకారం అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన చోటే పునప్రతిష్టించారు.ఈ సందర్భంగా పి. శంకర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ కులమతాలకు అతీతంగా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని అనుమతుల పేరుతో తొలగించడం బాధాకరమన్నారు. దేశంలో అనేక ప్రాంతాల్లో వివిధ మహనీయుల విగ్రహాలు ఉన్నప్పటికీ, అంబేద్కర్ విగ్రహాల విషయంలోనే అనుమతుల నిబంధనలను ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావిస్తున్నారని ప్రశ్నించారు.గ్రామ పంచాయతీ ఎదుట అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల పంచాయతీ గౌరవం మరింత పెరుగుతుందన్నారు. రాష్ట్ర శాసనసభతో పాటు దేశ పార్లమెంటు ప్రాంగణంలోనూ అంబేద్కర్ విగ్రహాలకు ఉన్న ప్రాధాన్యతను అధికారులు గుర్తించాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ప్రజల హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని దళిత, బహుజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని, విగ్రహాల ఏర్పాటు విషయంలో వివక్ష చూపకూడదని స్పష్టం చేశారు. అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అమలులో ఉన్న జీవో 18ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు మరోసారి అంబేద్కర్ విగ్రహాలను తొలగించే చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ముత్యంపేట గ్రామంలో తొలగించిన విగ్రహాన్ని తిరిగి అదే స్థలంలో బౌద్ధ ఆచారం ప్రకారం పునఃప్రతిష్ఠించడం ద్వారా అంబేద్కర్ ఆశయాల పట్ల తమ నిబద్ధతను చాటుకున్నామని పి. శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు, ఎమ్మార్పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షులు అయ్యగల్ల రవి, మాల మహానాడు దౌల్తాబాద్, రాయపోల్ మండలాల అధ్యక్షులు బొల్లం రాజేష్, సోక్కం స్వామి, నాయకులు గజ్వేల్ రామచంద్రం, పుట్ట రాజు, ఉషనగల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీకాంత్, పరశురాములు, కరుణాకర్, ప్రవీణ్, మహేష్, స్వామి, ప్రశాంత్, నర్సింలు, రాజయ్య, దుర్గయ్య, మీన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ములుగు చెరువు హద్దులేవి..?

98.5 ఎకరాల లెక్కలేవి..?
సర్వే నంబర్లు 80-90, 239లో సమగ్ర సర్వే చేపట్టాలి
ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిని తేల్చాలి
అధికారులకు శీలం తిరుపతిరెడ్డి వినతి

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:
గగన్‌పహాడ్ ప్రెస్టీజ్ సిటీ సమీపంలోని ములుగు చెరువు(పెద్ద చెరువు)హద్దులపై స్పష్టత కరువైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలం తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. చెరువుకు సంబంధించిన 98.5 ఎకరాల భూమి పరిధిని అధికారికంగా నిర్ధారించేందుకు సమగ్ర భూసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.సర్వే నంబర్లు 80 నుంచి 90 వరకు,239లోని భూములను పరిశీలించి చెరువు శిఖం,ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను స్పష్టంగా గుర్తించాలని కోరారు.

పాత రికార్డుల ఆధారంగా సర్వే చేయాలి
శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..గ్రామ మ్యాప్,టిప్పన్,సేత్వార్ తదితర రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి భూముల విస్తీర్ణం, సరిహద్దులను నిర్ధారించాలన్నారు.చెరువు భూములు,ప్రభుత్వ భూముల విషయంలో ఎలాంటి సందిగ్ధతకు తావులేకుండా అధికారులు స్పష్టమైన నివేదిక రూపొందించాలని కోరారు. హద్దులపై స్పష్టత లేకపోతే భవిష్యత్తులో భూవివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకోవాలి
చెరువు హద్దుల ఉల్లంఘనలు లేదా ఆక్రమణలు ఉన్నాయా అనే అంశాన్ని సమగ్ర సర్వే ద్వారా తేల్చాలని తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు.ఆక్రమణలు ఉన్నట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.అయితే ప్రస్తుతం ఎలాంటి ఆక్రమణలు అధికారికంగా నిర్ధారణ కాలేదని,సర్వే ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్డీవో,తహసీల్దార్‌కు వినతి
ములుగు చెరువు పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, మండల తహసీల్దార్ బొమ్మ రాములుకు బుధవారం శీలం తిరుపతిరెడ్డి,సూరెడ్డి సాయికృష్ణారెడ్డి, రవికుమార్,వెంకటేష్ గౌడ్, సాయి వినతిపత్రం అందజేశారు.రెవెన్యూ, సర్వే,సంబంధిత చెరువుల పరిరక్షణ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి,చెరువు అసలు హద్దులు, ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ వివరాలను అధికారికంగా వెల్లడించాలని కోరారు. ములుగు చెరువు భూములపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

వ్యవసాయ బావిలో పడి ఇద్దరు వలస కూలీల దుర్మరణం

ప్రజా వాయిస్, కథలాపూర్:
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వినుకొండకు చెందిన వినుకొండ ఆనంద్ బాబు (22), కొత్తజాన్ గమినేలు (19) ఉపాధి కోసం గత వారం రోజులుగా చింతకుంటలో మేస్త్రి దేవండ్ల విష్ణు వద్ద కూలి పనులు చేస్తూ అక్కడే ఉంటున్నారు.సోమవారం రాత్రి మద్యం తాగేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు తిరిగి రాలేదు. దీంతో ఉదయం వెతకగా.. గ్రామ శివారులోని బైర రాములు వ్యవసాయ బావిలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడి నీట మునిగి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మేస్త్రి విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్ఐ సి.హెచ్. రవికిరణ్ తెలిపారు.

బాలికలు తమ హక్కులు,రక్షణపై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దు
వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు
సైబర్ వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి
సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
అవసరమైనప్పుడు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హనుమకొండలోని బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో షీ టీమ్స్ ఎసిపి సదయ్య నేతృత్వంలో బాలికా సంఘాలకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ జీవితంలో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని బాలికలకు సూచించారు. ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైనప్పుడు షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు.

సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మానసిక అడ్డంకులను అధిగమిస్తూ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.రాధిక మాట్లాడుతూ, కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా, సంకోచించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలను ధైర్యంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ౼ాఃుఖ ఇన్‌స్పెక్టర్ ఓ.రమేష్, భరోసా సెంటర్ ఎస్ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్.ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావు తదితర పోలీస్ అధికారులు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సోనాలలో టీపీఎస్ పాఠశాల ఏర్పాటు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం
మండలానికి టీపీఎస్ స్కూల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజా వాయిస్ సొనాల/బోథ్
ఆదిలాబాదు జిల్లా సోనాల మండల కేంద్రానికి టీపీఎస్ పాఠశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభివృద్ధిని స్వాగతించకుండా, గతంలో పాఠశాల రాకుండా అడ్డుకున్న కొందరు నేతలు నేడు తమ వల్లే వచ్చిందని ప్రగల్భాలు పలుకడం హాస్యాస్పదమని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు.ఈ పాఠశాల మంజూరు వెనుక మాజీ ఎంపీ సోయం బాపురావు, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, తుల అరుణ్, జిల్లా పీఏసీ సభ్యులు ఏలేటి అశ్విన్ రెడ్డిల కృషి ఎంతో ఉందని నాయకులు స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో గ్రామాలకు కనీస వసతులు కల్పించని వారు, నేడు ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సోనాల రోడ్ల అభివృద్ధికోసం దాదాపు కోటి రూపాయలు మంజూరు చేసి రవాణా వసతులను మెరుగుపరిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షులు వినోద్ చౌహాన్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్, డీసీసీ కార్యదర్శులు లోలపు పోశెట్టి, హరిసింగ్, స్థానిక సర్పంచులు,నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మల నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు

మహిళలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని అకెనపల్లి గ్రామం లో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, ఆడపడుచులు బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని వివిధ నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే దారుల్లో ఉన్న గుంతలను పూడ్చి, ప్రదేశాలను ట్రాక్టర్లతో చదును చేయించారు.ఆకేనపల్లి గ్రామంలో ప్రతిరోజూ మహిళలు బతుకమ్మలు ఆడిన అనంతరం సమీపంలోని కుంటలు, చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, నిమజ్జన ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన బెల్లంపల్లి మండల విశ్వహిందూ పరిషత్ నాయకులు గ్రామాన్ని సందర్శించారు. నిమజ్జన ప్రదేశాలను పరిశీలించి, సమస్యలను గ్రామ సర్పంచి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన గ్రామ కార్యదర్శి బాకీ శ్రీనివాస్ నిమజ్జన ప్రదేశాలైన ఊర చెరువు, అగోని ఒర్రె, తూకుంట చెరువు ఒర్రె, నేతకాని వాడ ఒర్రె ప్రాంతాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టారు. ట్రాక్టర్లతో ఆయా ప్రదేశాలను చదును చేయించడంతో పాటు, మార్గమధ్యంలో ఉన్న గుంతలను మట్టితో పూడ్చించారు. మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మలను నిమజ్జనం చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. పండుగ సమయంలో మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారానికి కృషి చేసిన విశ్వహిందూ పరిషత్ నాయకులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బెల్లంపల్లి ప్రఖండ కార్యదర్శి మిట్ట శ్రీను, జిల్లా అధ్యక్షులు రేవెల్లి రాజలింగు, ప్రఖండ అధ్యక్షులు మనోజ్ మారు, జిల్లా సహ కార్యదర్శి కంచి వేణు, మాతృశక్తి జిల్లా సంయోజిక కన్నూరి గోవర్ణ, కార్యదర్శి బాల సంతోష్, సెగ్యం వీరమల్లు, బోరిగం దేవేందర్, ఆగిడి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



రాయపోల్‌లో బహుజన బతుకమ్మను విజయవంతం చేయండి

ఈ నెల 17న నిర్వహణ.. ముఖ్య అతిథిగా విమలక్క

ప్రజా వాయిస్ దౌల్తాబాద్:
ఈ నెల 17న సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో నిర్వహించే బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు కూలి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి, కార్యదర్శి సూరంపల్లి మహేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని, బహుజన బతుకమ్మ ప్రజా సమస్యలపై పోరాట వేదికగా నిలుస్తోందని అన్నారు. గ్రామీణ ఉపాధి, స్వయం సమృద్ధి, నిరుద్యోగం, అధిక ధరలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాలని, సామాజిక సమానత్వం సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రజా గాయని విమలక్క ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుడుం స్వామి, టీయూఎఫ్ నాయకుడు మేకల రాములు, కె. మహేందర్, బాలన్న, కుమార్, యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా శ్రీ విద్యాధరి దివ్యదర్శనం

- ఆదిశక్తి అలంకారంలో భక్తులకు అమ్మవారి దర్శనం
- శరన్నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలు
- భక్తిశ్రద్ధలతో చండీ హోమం, ప్రత్యేక అభిషేకాలు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న వర్గల్ క్షేత్రం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. హిందూ ధర్మంలో ఆదిశక్తి పరమోన్నత రూపంగా పూజలందుకునే లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దివ్యమంగళ రూపం, ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శ్రీ విద్యాధరి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజ, సుప్రభాతం, గిరి ప్రదక్షిణం, విశేష అలంకారం, పంచహారతులు, చతుష్షష్ట్యుపచార పూజలు, రాజోపచార పూజలు, చండీ హోమం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళహారతులతో క్షేత్రం భక్తిమయంగా మారింది. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి ఆరాధనకు శాక్తేయ సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉంది. అమ్మవారి అనుగ్రహంతో లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా ఐఎంఏ మహిళా వైద్యుల బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు
- ఆటపాటలతో సందడిగా వైద్యుల కుటుంబాలు
- ప్రబోధాత్మక బతుకమ్మలకు బహుమతులు
- పండుగల విశిష్టతపై ప్రశ్నావళి పోటీలు
- ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డా. పద్మజ్యోతి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : గజ్వేల్ పట్టణంలోని భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) భవనంలో మహిళా వైద్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళా వైద్యులు తమ కుటుంబాలతో కలిసి సృజనాత్మకంగా వివిధ రకాల బతుకమ్మలను రూపొందించి, ఆటపాటలతో వేడుకల్లో సందడి చేశారు. ప్రబోధాత్మక సందేశాలతో తయారు చేసిన బతుకమ్మలకు బహుమతులు అందజేయడంతో పాటు, తెలంగాణ పండుగల విశిష్టతపై ప్రశ్నావళి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ గజ్వేల్ శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు డా. పద్మజ్యోతి మాట్లాడుతూ.. గత సంవత్సరం నుంచి గజ్వేల్ ఐఎంఏ భవనంలో మహిళా వైద్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడంతో పాటు, వైద్యుల కుటుంబాల మధ్య ఆత్మీయత, బంధుభావం మరింత బలపడుతున్నాయని పేర్కొన్నారు. డా. పెంటాచారి మాట్లాడుతూ.. పూలనే బతుకమ్మ దేవతగా భావించి పూజించే సంస్కృతి తెలంగాణ ప్రత్యేకత అని కొనియాడారు. ఇలాంటి పండుగలు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని పేర్కొన్నారు. డా. నరేశ్ బాబు మాట్లాడుతూ.. సామూహిక ఉత్సవాల ద్వారా సమాజంలో ఆత్మీయత, బంధుభావం పెంపొందించడంతో పాటు సమాజాన్ని సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. దేశహితం, ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని సూచించారు. సమాజంలో సానుకూల మార్పు కోసం స్వదేశీ, సామాజిక సమరసత, పౌర విధుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణతో కూడిన పంచ సూత్రాలను ఆచరించాలని కోరారు. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పాటించిన విలువలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డా. శైలజ, డా. మంజుల, డా. సుజాత, డా. స్రవంతి, డా. గీత, డా. శ్రీలత, డా. మాధవి, డా. సమీక్ష, డా. అఖిల, డా. హైమావతి, డా. ప్రశాంతి, డా. రచన, డా. జ్యోతిర్మయి, రమాదేవి, పద్మావతి, డా. నరేశ్ బాబు, మల్లయ్య, పెంటాచారి, సద్గుణాచారి, లింగం, నాగమునెయ్య, సాయినాథ్ రెడ్డి, రాజేశ్ కుమార్, కుమారస్వామి, రాజకుమార్, మహిపాల్, శ్రీధర్, సాయి మహేష్, సత్యనారాయణ, అశ్విన్, రవిచంద్ర, సంతోష్, ప్రేమ్‌కుమార్, చైతన్య, ప్రవీణ్ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

సమతామూర్తి క్షేత్రంలో వైభవంగా శరన్నవరాత్రులు

సంతానలక్ష్మీ అలంకరణలో అమ్మవారి దర్శనం

ప్రత్యేక ఆకర్షణగా పుత్రకామేష్టి యాగం

చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

ఆధ్యాత్మిక శోభతో సమతామూర్తి క్షేత్రం

ప్రజావాయిస్//రాజేంద్రనగర్: ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం(స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ)ప్రాంగణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు సంతానలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి మార్గదర్శకత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.సంతాన సౌభాగ్యాలను ప్రసాదించే అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రత్యేక ఆకర్షణగా పుత్రకామేష్టి యాగం

నాలుగో రోజు ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పుత్రకామేష్టి యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణలు,హోమ క్రతువులతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.లోక కల్యాణం,సకల జనుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారి విశేష అలంకరణలు,వేద మంత్రాల నడుమ పూజా కార్యక్రమాలతో ముచ్చింతల్ క్షేత్రం భక్తిభావంతో వెల్లివిరిసింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయబద్ధంగా వేడుకల నిర్వహణ
- తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు
- పాటలు, ఆటలతో మహిళల సందడి
- ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం
- మహిళలకు వాయనాల పంపిణీ
- మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, కమిషనర్ పి. గణేష్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణకర్ పద్మ బాయి నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాల్గొన్నారు. రంగవల్లులు, విద్యుత్ దీపాల అలంకరణలతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రకృతిని పూజించే ఈ విశిష్టమైన సంప్రదాయం మన సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు కలిసికట్టుగా సంప్రదాయ వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేస్తాయని పేర్కొన్నారు. అనంతరం మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. అందంగా పేర్చిన బతుకమ్మల్లో ఉత్తమంగా నిలిచిన వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు మహిళలందరికీ వాయనాలు పంపిణీ చేశారు. అనంతరం బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సజావుగా సాగిన మండల సమన్వయ సమావేశం..

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై అధికారులను ప్రశ్నించిన సర్పంచులు

మాకు తెలవకుండానే కాంగ్రెస్ కార్యకర్తలకి ఎలా తెలుస్తాయని ఆగ్రహం..

బి ఆర్ ఎస్ సర్పంచుల మని మా గ్రామాల అభివృద్ధిని విస్మరిస్తున్నారని సర్పంచుల ఆవేదన..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మూడవ మండల సమన్వయ సమావేశం స్పెషల్ ఆఫీసర్ డి. ఆదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ గా నియమితులైన మొదటిసారి సమావేశానికి హాజరైన ఎలిగేటి ఇంద్రసేనారెడ్డిని స్పెషల్ అధికారి, ఎంపీడీవో శాలువాతో సన్మానించారు. ఈ సమావేశం వివిధ గ్రామాల నుంచి హాజరైన సర్పంచులు అభివృద్ధి సమస్యలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులను నిలదీయడంతో సమావేశంలో వాతావరణం వేడెక్కింది. గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో విస్మరిస్తున్నారంటూ సర్పంచులు అధికారులపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో గోప్యత..

అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత కొరవడిందని సర్పంచులు మండిపడ్డారు. అర్హుల తుది జాబితాలు గ్రామాల్లోని బాధ్యులైన తమకు (సర్పంచులకు) తెలియకుండానే అధికార పార్టీకి చెందిన కొందరి నాయకులకు కార్యకర్తలకు ముందే ఎలా వెళు తున్నాయని అధికారులను ప్రశ్నించారు.

అధికారుల ద్వంద్వ వైఖరి..

గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చిన ఏ అభివృద్ధి పని తలెత్తిన అర్ధరాత్రి అయిన అధికారులంతా సర్పంచులను సంప్రదిస్తారని కానీ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కానున్న జాబితా వంటి కీలక విషయాల్లో మాత్రం తమను పూర్తిగా పక్కన పెడుతున్నారని వాపోయారు.

నిధుల కేటాయింపులో రాజకీయ విపక్ష..

తాము బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన సర్పంచుల మనే కక్షతోనే తమ గ్రామాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యంగా తమ గ్రామాలకు సిసి రోడ్లు ఇతర మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయకుండా తీవ్రమైన పక్షపాతం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా నిబంధనాల ప్రకారం పని చేయాలని లేని పక్షంలో గ్రామస్తులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని సర్పంచులు హెచ్చరించడంతో సమావేశంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందిరానగర్ సర్పంచ్ మాట్లాడుతూ, మంచినీటి బావులు అడుగంటుతున్నాయని బావులు పూటికలు తీయాలని అన్నారు. ఇంద్రానగర్ రెవెన్యూ భూములు హద్దులు నిర్ణయించాలని కోరారు. ప్రత్యేక అధికారి డి. ఆదిరెడ్డి మాట్లాడుతూ, ఏలో నీ నో ప్రభావం వలన భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని త్రాగునీటికి ఎలాంటి ఆటంకం కాకుండా మిషన్ భగీరథ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వాళ్లు సమన్వయంతో నీటి ఎద్దటి రాకుండా చూడాలని అన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామాలలో గడ్డి చుట్టే యంత్రాలు బెలార్లు ఇచ్చామని వాటిని ప్రతి ఒక్క రైతులు వాడుకోవాలని తెలిపారు. రాబిలో వరి సాగు చేయవద్దని ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి డి. సిద్ధార్థ నాయక్, మండల వ్యవసాయ అధికారి వెటర్నరీ అధికారి, మండల వైద్యాధికారులు, పంచాయతీరాజ్, ఏ ఈ విద్యుత్ శాఖ ఏఈ అన్ని శాఖల అధికారులు అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

గజ్వేల్‌కు మళ్లీ వస్తా.. ఒకరోజంతా మీతోనే ఉంటా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో
- కేటీఆర్‌కు ఘన స్వాగతం
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- పార్టీ శ్రేణులతో ఆప్యాయంగా మాట్లాడిన కేటీఆర్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని రిమ్మనగూడ ఎస్-4 వద్ద బుధవారం గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మరోసారి గజ్వేల్‌కు వస్తానని, ఒకరోజంతా పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే గడుపుతానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులను ఆప్యాయంగా పలకరించి, వారితో కొద్దిసేపు మాట్లాడారు. కేటీఆర్ ఇచ్చిన హామీతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. రిమ్మనగూడ వద్ద తనకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులకు కేటీఆర్ అభివాదం చేశారు. నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి అభిమానానికి స్పందించారు. గజ్వేల్ నియోజకవర్గానికి మరోసారి వచ్చి, రోజంతా వారితో గడుపుతానని చెప్పడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమైంది. అనంతరం కేటీఆర్ భారీ కాన్వాయ్‌తో గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని ఓటర్లు సద్వినియోగ పరుచుకోవాలి

18 సంవత్సరాలు పూర్తయిన యువతి యువకులు ఓటర్లుగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి

జిల్లా ఎన్నికల & భద్రాద్రి జిల్లా కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఈనెల 15.10.2026 మరియు 16.10.2026 తేదీలలో రాష్ట్ర గౌరవ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఇటువంటి అవకాశాన్ని జిల్లా ఉన్న వ్యాప్తంగా ఓటర్లు సద్వినియోగపరచుకోవాల్సిందిగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అంకిత్ వెల్లడించారు. ఈ శిబిరాల సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ,తమ తమ పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.కావున, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ ఓటు వివరాలు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరడమైనది. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కానివారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా,18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.కావున అర్హులైన ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీనియర్ మహిళల టీ-20 ట్రోఫీకి హైదరాబాద్ జట్టుకు ఎంపికైన ఏజెన్సీ ప్రాంత ఆదివాసి, అడవి బిడ్డ తాటి కృష్ణవేణి

ప్రజా వాయిస్ గంగారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిరుమలగండి గ్రామానికి చెందిన తాటి కృష్ణవేణిని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క శాలువాతో సత్కరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డ జాతీయ స్థాయిలో మన రాష్ట్ర పేరు నిలబెట్టడం ఎంతో గర్వకారణం. మహిళా క్రికెట్ రంగంలో కృష్ణవేణి మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనసారా కోరుకుంటున్నాని అన్నారు.ఆడబిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే మన ప్రభుత్వ లక్ష్యంఅన్నారు . క్రీడారంగంలో వారికి అన్ని విధాలా అండగా ఉంటాం అన్నారు.

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నికైన డా. పెసరు విజయచందర్ రెడ్డికి ఘన సన్మానం

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ని దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డా. పెసరు విజయచందర్ రెడ్డి కి అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ల్యాదెళ్ల గ్రామానికి చెందిన చింతం రంజిత్, ల్యాదెళ్ల కుమారస్వామి, ల్యాదెళ్ల విజేందర్, కోడెపాక సతీష్, ల్యాదెళ్ల చిన్న, ఆకునూరు శ్రావణ్, బాబు, కోడెపాక రమేష్, ల్యాదెళ్ల శ్రీను, ల్యాదెళ్ల దాసు, ల్యాదెళ్ల కాశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:
జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అధ్యక్షతన పోలీస్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, మహిళలు, పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రతపై సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ఆస్తి నేరాలు, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలపై నేరాలు, కులవివక్ష దాడులు, అదృశ్యమైన వ్యక్తుల కేసుల్లో నిందితుల అరెస్టుకు జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. నిఘా కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, రాత్రివేళల్లో గస్తీని పెంచాలని తెలిపారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని, నేరాల నియంత్రణకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వివిధ విభాగాల ఉప పోలీసు అధికారులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్సైగా కొంపెల్లి సతీష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజావాయిస్, మోత్కూరు,(అక్టోబరు 14):
మోత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్సైగా కొంపెల్లి సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్హెచ్ఓగా పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లడంతో సతీష్ ఈ బాధ్యతలు చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు.

నాపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి..

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో చర్చకు సిద్ధం
ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రజ్ఞా నాయక్ హెచ్చరిక

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ కాంగ్రెస్ కమిటీ విస్తరణ సందర్భంగా జరిగిన పరిణామాలు, తనపై వస్తున్న సస్పెన్షన్ వార్తలపై ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కరంటోతు ప్రజ్ఞా నాయక్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండల కమిటీ విస్తరణలో జరిగిన తీరుపై తాను మాట్లాడినందుకే కొందరు కావాలనే తనపై విష ప్రచారం చేయిస్తున్నారని ప్రజ్ఞా నాయక్ ఆరోపించారు. పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారంటూ తప్పుడు ప్రచారాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లు పార్టీ అధికారంలో లేనప్పుడు ఇబ్బందుల్లో ఉన్నా తాను పార్టీనే నమ్ముకుని పనిచేశానని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే వలస నాయకుల వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని, ఈ వ్యవహారంపై ఎవరికైనా ఇష్టమైతే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మండలంలో పార్టీ కోసం కష్టపడుతున్న వారిని చిన్నచూపు చూస్తున్నారని, ఈ విషయాలన్నింటినీ పేర్లతో సహా త్వరలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మణుగూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మహా ధర్నా

ప్రజల ప్రాణాలు కాపాడడమే ఏజెండగా ముందుకు సాగిన మన్యం పులి
ఇసుక రవాణా కోసం ప్రజల ప్రాణాలు తీస్తే సహించేది లేదని హెచ్చరిక
అభివృద్ధి చేయలేని ఎమ్మెల్యేకు 120 ఎకరాల భూములు ఎలా పెరిగినాయో చెప్పాలి
ప్రజల ప్రాణాలు కాపాడమంటే గిరిజన సొసైటీ ఆదివాసులను రెచ్చగొట్టడం ఏమిటి ?
అభివృద్ధిపై అవగాహన ఉంటే మణుగూరు పట్టణాన్ని క్లీన్ సిటీ,గా మార్చి చూపించాలి
అక్రమ ఆస్తులపై అంబేద్కర్ సెంటర్లో చర్చిద్దాం అంటే సై పాయం అక్రమ ఆస్తులు బహిరంగంగా బయటపెట్టిన రేగా కాంతారావు

ప్రజా వాయిస్ మణుగూరు
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ రాజకీయం అంటేనే నేడు భగ భగ మండే నిప్పుల కుంపటి లా మారింది . అభివృద్ధి చేతగాని పినపాక కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల కు అక్రమ ఆస్తులు ఎలా వచ్చాయో మణుగూరు పట్టణ అంబేద్కర్ సాక్షిగా ఆస్తుల లెక్కల చర్చలు జరగాలి అంటూ పినపాక మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు చేసిన వ్యాఖ్యలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే రాజకీయ నిప్పుల కుంపటి రగలించింది. ఇసుక క్వారీల కోసం ప్రధాన రహదారులు సర్వనాశనం గుంతలు పడినా రహదారిపై ఇసుక సంపద నిలువు దోపిడీ చేస్తున్నట్లు రేగ కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై వాహనదారులు ప్రయాణించాలి అంటే ప్రజలు ప్రాణం గుప్పెట్లో పెట్టుకొని భయభ్రాంతులకు గురవుతున్నట్లు రేగా కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక లారీలు తగ్గించమంటే. గిరిజన సొసైటీ సభ్యులుగా గుర్తింపు పొందిన ఆదివాసులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటని ఆయన మండిపడ్డారు. ఈ ప్రాంతంలో పుట్టిన ఆదివాసి బిడ్డగా నేను ప్రజల ప్రాణాలు కాపాడమంటే నీచ రాజకీయాలు చేయడం స్థానిక ఎమ్మెల్యేకు అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు మండిపడ్డారు. ఈ ప్రాంత ఆదివాసి బిడ్డలకు గిరిజన సొసైటీలు సృష్టించి ఇచ్చిందే నేనైతే నా మీద నీచపూ రాజకీయాలు చేయడం. నా వ్యక్తిగత జీవితం రాజకీయం చేయడం. ప్రజలను మభ్యపెట్టి పాలించడం, అమాయక కార్యకర్తలపై పై వ్యక్తిగత దాడులు చేయడం, అంటే దిగజారిన రాజకీయం చెయ్యడమే అంటూ రేగా కాంతారావు తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. అక్రమ ఆస్తులు నీకు ఉన్నాయో నాకు ఉన్నాయో తేల్చాలి అంటే అంబేద్కర్ సాక్షిగా చౌరస్తా వేదికగా చర్చలు జరపడానికి నేను సిద్ధంగా ఉన్నానని బహిరంగ సవాల్ చేశారు. శిథిలావస్థకు చేరిన రహదారులు బాగు చేయమంటే, స్పందించలేని ఈ ప్రాంత ఎమ్మెల్యే ఇసుక లారీలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమిటి అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రహదారులపై ప్రజలు ప్రయాణించాలంటే ఇసుక లారీలు, బొగ్గు లారీలు రాకపోకలతో మణుగూరు ప్రజలు నరకం అనుభవిస్తూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బతుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణుగూరు పట్టణంలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడి, దుమ్ము అధికంగా లేస్తుంటే. కనీసం రోడ్లపై నీళ్లు చల్లాలని మేము అడుగుతే కాంట్రాక్టర్లు మాకు ఇన్సూరెన్స్ లు ఉన్నాయి. ప్రజల ప్రాణాలు ఎక్కడ పోతే మాకేంటి. అనే అహంకారంతో సొసైటీ సభ్యులనే ఉసుగల్పుతున్నట్లు రేగా కాంతారావు మీడియాకు వివరించారు. ఈ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సొసైటీలు సృష్టించిందే నేనైతే. నేను గిరిజన సొసైటీలకు వ్యతిరేకం అనే అంతర్గత కుట్రలు చేస్తూ గిరిజన ప్రజలను రెచ్చగొట్టడం, సరైన పద్ధతి కాదని ఆయన బాధపడ్డారు. ఈ ప్రాంతంలో బ్రతికే గిరిజనులకు నేనెప్పుడూ వ్యతిరేకి కాదని రేగా కాంతారావు బహిరంగ ప్రకటన చేశారు. మణుగూరు పట్టణాన్ని క్లీన్ ,సిటీ'గా మార్చడమే తన లక్ష్యమని రేగ కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తుంటే పినపాక ఎమ్మెల్యే తన భూములపై ఎంక్వేరీలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు . పుచ్చలపల్లి సుందరయ్య నే ఆదర్శంగా తీసుకొని తాను ముందుకెళు తున్నానని రేగ కాంతారావు బహిరంగ ప్రకటన చేశారు. మణుగూరు సింగరేణి ఓసి ఓపెన్ కాస్ట్ విస్తరణంలో అధికార పార్టీ బినామీలు ఎంతమంది ఉన్నారో తనకు తెలుసు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని అక్రమాలకు పాల్పడే ప్రతి ఒక్కరిని జైలుకు పంపుతానని కాంగ్రెస్ నేతలకు హెచ్చరిక జారీ చేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు చిత్తశుద్ధి ఉంటే తుమ్మల చెరువు గ్రామ సమీపంలో 50 ఎకరాలు, మొరంపల్లి బంజరలో 50 ఎకరాలు, దుమ్ముగూడెం మండలంలో 20 ఎకరాలు, ఈ మూడేళ్ల పాలనలో ఎలా కొనుగోలు చేశారో నా దగ్గర ఆధారాలు ఉన్నాయని ప్రకటించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చేయలేని ఎమ్మెల్యేకు అక్రమ ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు తెలపాలని పాయం వెంకటేశ్వర్లకు దడ పుట్టించే బాంబు పేల్చారు. ఎవరికి వారసత్వ ఆస్తులు ఉన్నాయి? ఎవరు అక్రమంగా సంపాదించారు? అనేది అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఎదురెదురుగా కూర్చుని తేల్చుకుందామని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై వ్యక్తిగత దాడులకు దిగితే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు, మీరు సంపాదించిన అక్రమ ఆస్తుల చిట్టా మొత్తం నా దగ్గర ఉందని. కాంగ్రెస్ పార్టీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరి ఇప్పటికైనా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. గత మూడు సంవత్సరాల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటి? ఏజెన్సీ ప్రాంత ప్రజలను మభ్యపెట్టి చేసిన మోసం ఏమిటి!? సంపాదించిన ఆస్తులు ఏమిటి అనేది బయట పెడతారా? లేదంటే ఇసుక లారీలతో ప్రజలకు నరకం చూపించే పాయం వెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గం లో కాంగ్రెస్ నేతలు రెచ్చగొట్టి రాజకీయ రణరంగం సృష్టిస్తారా అనేది వేచి చూడాలి మరి... ఏది ఏమైనా ఇప్పటికైనా 35 వేల ఓట్లతో గెలిపించిన ప్రజల కోరికలు తీరేలా ప్రధాన రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని ఓటు వేసిన ప్రజలు ప్రత్యేకంగా కోరుకుంటున్నారు...

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ,,అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్

ఈ పండుగ తెలంగాణ ఆత్మ గౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రత్యేకంగా నిలుస్తుంది
ఐడీఓసీ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు..అదనపు కలెక్టర్

ప్రజా వాయిస్.. వనపర్తి
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై, బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్ మాట్లాడుతూ,,, ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఆనందోత్సాహాలను నింపడంతో పాటు కుటుంబాలు, సమాజం మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రకృతితో మమేకమై పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది సమష్టిగా ఇలాంటి సాంస్కృతిక వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వైభవంగా బతుకమ్మ సంబరాలు ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మహిళా సిబ్బంది సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఉత్సాహంగా నృత్యాలు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పాల్గొనడంతో ఐడీఓసీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళల ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) భాస్కర్ నాయక్, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలి., రైతులకు 18 గంటల విద్యుత్ ఇవ్వాలి

ప్రజావాయిస్/తుర్కపల్లి
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కేంద్ర లో ఎల్‌నినో ప్రభావం, నీటి కొరత, విద్యుత్ కోతలతో రాష్ట్రం లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే 18 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని సీపీఎం తుర్కపల్లి మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ బుధవారం తుర్కపల్లిలోని విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడాలని, కరెంట్ కోతలను అరికట్టాలని, విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తలారి మాతయ్య గడ్డమీది నరసింహ ఆవుల కలమ్మ నాయకులు సిల్వర్ పెంటయ్య కోట నాగరాజు భూక్య లక్ష్మి తార్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి

- డీఆర్డీఓ నాగిరెడ్డి

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించి, కూలీల సంఖ్య పెంచాలని డీ ఆర్ డీ ఓ నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులకు సోషల్ ఆడిట్లో మొత్తం రూ. 2,58,17,047 లకు సంబంధించిన ఆడిట్ పూర్తి చేసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఆడిట్ సమీక్ష తర్వాత రూ. 2,155 రికవరీ చేయుటకు ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో అవసరమైన చోట్ల పశువుల నిటి తోట్ల నిర్మాణాలు, పాత తోట్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య ఏపీడీ నవీన్ క్వాలిటీ కంట్రోల్ డీఈ ఫసీయుద్దీన్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆదిత్య, ఏపీవో రవీందర్, వీబీజీ రాంజీ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ లోన్‌కు లంచం కట్టాల్సిందేనా!

కొడకండ్ల ఎస్‌బీఐ లో రైతులపై దళారుల ఒత్తిడి?
లక్షకు రూ.15 వేల డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు
మేనేజర్ పాత్రపైనా అనుమానాలు.. సమగ్ర విచారణకు రైతుల డిమాండ్
ఇన్సూరెన్స్ పేరుతో రూ.30 వేల వసూళ్లపై సందేహాలు
నాలుగు నెలలుగా ప్రీమియం చెల్లిస్తున్నా బాండ్ పత్రాలు అందలేదంటూ ఆవేదన
బ్రాంచ్ మేనేజర్ క్యాబిన్లో కూర్చుంటున్న ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరు?
మేనేజర్ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు
ఉన్నత అధికారులు వస్తే మేము ఆధారాలు మొత్తం వారికి ఇస్తాం రైతులు

ప్రజా వాయిస్/కొడకండ్ల (సెప్టెంబర్ 14)
కొడకండ్ల రైతులకు పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించే క్రాప్ లోన్లు సైతం కొందరికి భారంగా మారుతున్నాయా? బ్యాంకులో రుణం మంజూరు కావాలంటే దళారులకు డబ్బులు చెల్లించాల్సిందేనా? జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో క్రాప్ లోన్ల కోసం వస్తున్న రైతులు చేస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వివిధ గ్రామాలకు చెందిన రైతులు రుణాల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా, తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షకు రూ.15 వేలు డిమాండ్ చేస్తున్నారంటూ రైతుల ఆరోపణలు:
క్రాప్ లోన్ మంజూరు కావాలంటే ఒక్కో లక్ష రూపాయలకు రూ.15 వేల వరకు చెల్లించాలని ముగ్గురు వ్యక్తులు డిమాండ్ చేస్తున్నట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. రుణం మంజూరు కాకముందే డబ్బులు ఇవ్వాలని, అప్పుడే ఫైల్ ముందుకు కదులుతుందని ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే పంటల సాగుతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమపై అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మేనేజర్ పాత్రపై విచారణ జరపాలి
బ్యాంకు మేనేజర్ చెప్పడం వల్లే తాము డబ్బులు అడుగుతున్నామని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో మేనేజర్ పాత్ర ఉందా? లేదా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. ఆరోపణల వాస్తవాలను నిర్ధారించకుండా ఎవరినీ దోషులుగా నిర్ధారించలేం. ఎస్‌బీఐ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, రైతుల నుంచి స్వతంత్రంగా వివరాలు సేకరించి నిజానిజాలను వెలికితీయాలని వారు కోరుతున్నారు.

రుణంలోనే కోత.. మళ్లీ రైతుల పైనే భారం?
పంట పెట్టుబడి కోసం తీసుకునే రుణంలోనే కొంత మొత్తం ఇతరులకు చెల్లించాల్సి వస్తే తమ కుటుంబాలు, వ్యవసాయ ఖర్చులు ఎలా నిర్వహించుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరుగుతుంటే, మరోవైపు రుణం కోసం అదనపు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకింగ్ వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమని, బాధితుల ఫిర్యాదులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో వసూళ్ల పైనా సందేహాలు:
క్రాప్ లోన్లకు సంబంధించి లైఫ్ ఇన్సూరెన్స్ పేరుతో తమ నుంచి సుమారు రూ.30 వేల వరకు తీసుకున్నారని, గత నాలుగు నెలలుగా కూడా ఇన్సూరెన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఆ బీమాకు సంబంధించిన బాండ్ పత్రాలు ఇప్పటివరకు అందలేదని చెబుతున్నారు. ఏ బీమా పథకం కింద ఎంత ప్రీమియం వసూలు చేశారు? ఆ మొత్తాన్ని సంబంధిత బీమా సంస్థకు జమ చేశారా? పాలసీ పత్రాలు ఎందుకు అందలేదు? అన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరు?
కొడకండ్ల ఎస్ బి ఐ లో క్రాప్ లోన్ల వ్యవహారంపై రైతులు చేస్తున్న ఆరోపణలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి బ్యాంక్ మేనేజర్ డ్రైవర్ తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మేనేజర్ క్యాబిన్లోనే ఉంటున్నారు దాని పక్కనే కూర్చుంటున్నారని రైతులు చెప్తున్నారు బ్యాంకు తెరిచిన సమయం నుంచి మోషే వరకు అక్కడే ఉంటూ రుణాల కోసం వచ్చే రైతులతో మాట్లాడుతున్నారని మీకు కాప్ లోన్ మంజూరు కావాలంటే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపణలో నేపథ్యంలో ఆ ముగ్గురి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఆ ముగ్గురికి అక్కడ పని ఏమిటి అంటే దీనిపైన మేనేజర్ వాళ్ళ ముగ్గురుని వారి దగ్గర పెట్టుకొని రైతులను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టుగా మాకు అనుమానం వస్తున్నది రైతులపై వారు ముగ్గురు డబ్బులు ఇస్తేనే మీ పని అయిపోతుంది మీకు లోను సాంక్షన్ అవుతుందని వారు మాపై దురుసుగా మాట్లాడుతున్నారు వారు ఎవరు అనేది మీరు విచారణ చేసి బాధ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలి.

ఎస్‌బీఐ ఆర్ ఎం స్పందించాలి:
కొడకండ్ల ఎస్‌బీఐలో క్రాప్ లోన్ల మంజూరు ప్రక్రియ, రైతుల నుంచి డబ్బుల డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు, ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై ఎస్‌బీఐ ఆర్ ఎం రీజినల్ మేనేజర్ సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత రుణ దరఖాస్తులు, చెల్లింపు రసీదులు, బీమా వివరాలు, రైతుల వాంగ్మూలాలను పరిశీలించి బాధ్యులెవరో తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై బ్యాంకు నిబంధనల ప్రకారం, అవసరమైన చోట చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు తమ ఫిర్యాదులను స్వేచ్ఛగా తెలియజేసే అవకాశం కల్పించి, రుణాల మంజూరులో పారదర్శకత ఉండేలా చూడాలని కోరుతున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

: ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

అచ్చంపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు
ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి
మూడేళ్లలో రూ.1,64,431 కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ
ఈ లెక్కలపై ఎలాంటి చర్చకైనా, సవాల్‌కైనా సిద్ధం
రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు.. జిల్లా వనరుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు
అచ్చంపేటను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దుతాం:-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజా అచ్చంపేట అక్టోబర్ 14)
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పర్యటన లో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అచ్చంపేట నియోజకవర్గంలో 74.82 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మన్ననూరులో 220/33 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన అనంతరం పక్కనే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులు, నదులు, ఖనిజ సంపద, మానవ వనరుల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేయడంతోపాటు, పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు
రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి ఆరు లక్షల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. పేదల ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.60 నుంచి రూ.70 వరకు ఉన్నప్పటికీ, పేదలకు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు కోటి ఆరు లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. 43 లక్షల కుటుంబాలకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 76 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. ఏడు లక్షల మంది పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం అచ్చంపేట నియోజకవర్గంలోనే 7,300 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ పేదలకు సొంతింటి కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నామని చెప్పారు. కళాశాలల్లో చదువుతున్న సుమారు 12 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో, నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికీ వర్తించేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వెల్లడించారు.

రహదారులకు రూ.90 వేల కోట్లు
తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో భారీగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి ప్రాజెక్టులపై దృష్టి సారించామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. నదులు, ఖనిజ సంపద, వ్యవసాయం, పర్యాటకం, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకొని జిల్లాలవారీగా ఆర్థిక ప్రగతిని సాధిస్తామని స్పష్టం చేశారు.

అచ్చంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
అచ్చంపేట నియోజకవర్గంతో తనకు 1980 నుంచి విడదీయలేని అనుబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తన సోదరుడు స్వర్గీయ మల్లు అనంతరాములు ఈ ప్రాంతం నుంచి పార్లమెంటుకు పోటీ చేసిన రోజుల నుంచి ఇక్కడి గ్రామాలతో తనకు పరిచయం ఉందని చెప్పారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యటించానని, ప్రజల సమస్యలను దగ్గరగా చూశానని తెలిపారు.గతంలో ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం విద్యుత్ శాఖ తన వద్ద ఉండటంతో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇప్పటికే 1,219 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 403 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. ఈ పనుల కోసం ఇప్పటికే సుమారు రూ.75 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రాబోయే 50 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశామని వెల్లడించారు.

ఎకో టూరిజంతో స్థానికులకు ఉపాధి
అచ్చంపేట ప్రాంతంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కృష్ణానదిపై వంతెనలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలిపారు. వీటి ద్వారా అచ్చంపేటను ప్రధాన రవాణా కూడలిగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. మన్ననూరు, నల్లమల అటవీ ప్రాంతాలకు ఉన్న సహజ సౌందర్యం, వన్యప్రాణుల సంపదను పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక గిరిజన కుటుంబాలు, రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు స్థానికంగా వసతి, ఆతిథ్యం, రవాణా, ఇతర సేవల ద్వారా కుటుంబాలకు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలను గుర్తించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు, నిధులు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

ప్రజల సమస్యలే ప్రభుత్వ ప్రాధాన్యాలు
గతంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పర్యటించిన రోజులను భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. 2023 మే 31న లింగాల మండలం అంబటపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 42 గ్రామాల్లో 130 కిలోమీటర్ల మేర నడిచామని తెలిపారు.ఆ సమయంలో ప్రజలు పెన్షన్లు, గ్యాస్, పోడు భూములు, విద్యుత్ బిల్లులు, సాగునీరు వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఎస్-ఎల్‌బీసీ ప్రాజెక్టును సందర్శించినప్పుడు పనులు పూర్తి చేసి నీటిని అందిస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. నక్కలగండి ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలనే అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను మరిచిపోకుండా, రాష్ట్ర ఆదాయానికి అనుగుణంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

అచ్చంపేటలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో అచ్చంపేట నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ, విద్యుత్ సరఫరా అంతరాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గతంలో అచ్చంపేట నియోజకవర్గంలో లో-వోల్టేజీ సమస్యతోపాటు వర్షాలు, ఈదురుగాలులు వీచినప్పుడు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడేదని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ పనులు చేసుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా, విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన సబ్‌స్టేషన్ల మంజూరుకు సహకరించారని తెలిపారు.నియోజకవర్గంలో 14 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లతోపాటు, 220/33 కేవీ, 132/33 కేవీ సామర్థ్యాలతో మరో రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ విద్యుత్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు వీలవుతుందని, లో-వోల్టేజీ సమస్యలు తగ్గడంతోపాటు విద్యుత్ అంతరాయాల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏర్పాట్లు రానున్న 5 దశాబ్దాల పాటు నియోజకవర్గ విద్యుత్ అవసరాలకు తోడ్పడతాయని పేర్కొన్నారు.అచ్చంపేట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి, సుమారు 500 ఎకరాల్లో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) విధానంలో ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకరిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు వీలుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా అచ్చంపేటలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న తన విజ్ఞప్తికి స్పందించి, కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ నరసింహ, గ్రామ సర్పంచ్ మంజుల, అధికారులు కాంగ్రెస్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు!